ఆగష్టు-2023

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక

## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| జప్పుత్పనేహు | కొడవటికంటి | 03 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 06 |
| విశ్వాసంలో ఆఖరి మెట్టు | కె. హారిక, B.D.S., | 08 |
| నాన్నగారితో నా అనుభవం | కె.ఇ.రాజేంద్ర | 10 |
| దేవుడు మనిషిలా చూడడు | హన్నాకృప డెస్క్ | 12 |
| కొడవటికంటిగారి శ్రమ దినములు | కె.ఇ.రాజేంద్ర | 13 |
| కొడవటికంటిగారి గురించి | హన్నాకృప డెస్క్ | 18 |
| ఫీబే | హన్నాకృప డెస్క్ | 20 |
| అంతర్దర్శిని | చిన్నపిల్లలకు | 22 |
| పరిశుద్ధగ్రంథపరిశోధనా పట్టిక-13 | | 24 |



సంపాదకులు :

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**

B.A.,B.L.,

**చందా వివరాలు :**

సంవత్సర చందా రూ. **350/-**

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-



**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ నెం. 51, క్లోపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9440217726



**బ్యాంకు అకౌంటు వివరాలు :**

A/c Name: **K. Emmanial Rajendra**

A/c No.: **10957294340**

Bank: SBI Main Branch, Ongole

IFSC Code : SBIN0000890


# HANNA KRUPA

**Christian Devotional Monthly Magazine**


**సంపుటి : 20** **సంచిక : 8**


**ప్రభువగు యెహోవాయే నాకు బలము**

THE ... CHURCH OF ... INDIA 1958

| సీరియల్ నంబరు | |
|---|---|

# సంపాదకీయం....

హన్నాకృప పాఠకులకు ప్రభువు నామమున వందనములు.

మా తండ్రిగారైన కొడవటికంటి సామ్యేల్ రాజేంద్రగారు జూలై 3వ తేది ఉదయం 10-55 ని.లకు ప్రభువు నందు నిద్రించినారు. ఆయన గత 20 సం॥లుగా 'హన్నాకృప' పత్రికను నడిపిస్తూ, 'కొడవటికంటి' అను కలం పేరుతో 30కి పైగా బైబిల్లోను వ్యక్తుల చరిత్రను నవలలుగా వ్రాసి చిన్నా, పెద్ద, పేద, ధనిక, క్రైస్తవులు, అన్యజనులు అన్న తేడా లేకుండా అనేకమంది పాఠకుల హృదయాలలో చెరగని ముద్ర వేశారు. తన రచనల ద్వారా ఎంతోమంది అభిమానులను సంపాదించుకొని, అనేకమందిచే సన్మానాలు, పురస్కారాలు పొందారు. 2013లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిగారి చేతుల మీదుగా 'ఉత్తమ క్రైస్తవ నవలా రచయిత' అవార్డు పొందియున్నారు. ఎంతోమంది ఆఫీసర్లు, రాజకీయ నాయకులు, బాగా డబ్బున్న వాళ్ళు ఆయనను ప్రేమించి, గౌరవించేవాళ్ళు. ఆయన మాత్రం ఈ లోకానుసారమైన ఆడంబరాలకు దూరంగా ఉండేవాడు. సామాన్యమైన జీవితం జీవిస్తూ, దేవుని పనికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ సువార్త ప్రకటించడానికి గ్రామాలు, పట్టణాలు, రాష్ట్రాలు ప్రయాణించేవాడు. సామ్యేల్ రాజేంద్రగారిని పోషించడానికి, హన్నాకృప పత్రికను నడిపించడానికి, ఆయన వ్రాసిన పుస్తకాలు ముద్రించడానికి దేవుడు అనేకమందిని సిద్ధం చేశాడు.

2000వ సం॥లో నాన్నగారిని మరణము నుండి తప్పించి 23 సంవత్సరాల ఆయుష్షును ఇచ్చిన దేవుడు చివరి మూడు సంవత్సరాలు శ్రమలకు అప్పగించాడు. 2020లో ఆయన కరోనా బారిన పడిన తర్వాత, స్వల్ప పక్షవాతమునకు గురై నడవలేని పరిస్థితుల్లో వాకర్ సహాయముతోనే కొంతకాలం ప్రయాణాలు చేశాడు. ఎవరినైతే 38 సంవత్సరాలు పోషించాడో, ఆ కుటుంబము వలన మానసిక క్షోభకు గురై, ఛీత్కరింపబడి రెండు సంవత్సరాలు నరకయాతన అనుభవించాడు. 'తన భక్తుల ప్రాణములను ఆయన కాపాడుచున్నాడు. భక్తిహీనుల చేతిలో నుండి వారిని విడిపించును' (కీర్తనలు 97:10) అను వాక్యప్రకారం తన సేవకుడైన సామ్యేల్ రాజేంద్రను ప్రేమించే దేవుడు ఆయనను మా దగ్గరకు పంపించి చివరి సంవత్సరము (2022-23) ప్రశాంతమైన జీవితాన్ని ఇచ్చి, మనసు నెమ్మది కలిగిన మరణాన్ని దయచేశాడు. ఇందునుబట్టి దేవునికి కృతజ్ఞతలు తెలియ జేయుచున్నాను. మా తండ్రిగారు నా మీద నమ్మకముతో నాకు అప్పగించిన 'హన్నాకృప' బాధ్యతను, ఆయన రచనల బాధ్యతను ఆయనను ప్రేమించే కుమారునిగా ఆయన పేరు నిలబెట్టుటకు, మీ ప్రార్థనా సహకారములతో నా శాయశక్తుల కృషి చేస్తాను. కష్టకాలములో నాన్నగారిని ఆదరించిన ప్రతిఒక్కరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను

-కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర

K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole
**A/c No. 10957294340**

సీరియల్

# జప్నత్పనేహు

(యోసేపు జీవిత చరిత్ర)

- కొడవటికంటి

యూషును కొంచెం చలించినట్లుగా కనిపించాడు. తనను తాను సంభాళించుకున్నాడు. అలా కాకపోతే తను సంతోషంగా జీవించలేడు. అదీకాక తనలాంటి దేశదిమ్మరికి డబ్బు ఉంది, పలుకుబడి ఉంది కాని, సుఖంలేదు. తను సుఖపడ్డానికి ఒకచోట స్థిరనివాసం చేస్తే సంపాదన ఆగి పోతుంది. ఇంతమందిని ఎలా పోషించాలి? సుఖానికి, డబ్బుకి పొందిక లేదు. సంతోషం – కొంటే వచ్చేది కాదు. కాలో, చెయ్యో మూలపడితేకాని తను ఓ చోట స్థిరంగా జీవించలేడు.

అంతలో కొంతమంది బానిసలు ముందు పరుగెత్తు తుంటే ఒక రథం వస్తుంది. దాని వెనుక నలుగురు అధి కారులు గుర్రాలమీద వస్తున్నారు. వారిని చూడగానే తన ప్రియ మిత్రుడైన 'పోతీఫరు' అనుకున్నాడు యూషును. అంతవరకు తన హృదయంలో ఉన్న వ్యాకులత ఒక్కసారిగా పటాపంచలైపోయింది. ముఖం విప్పారింది.

రథం వారి దగ్గరగా వచ్చి ఆగింది. పోతీఫరుకి ముప్పది అయిదు సంవత్సరాల వయస్సు ఉంటుంది. చక్కని ముఖం, తన ఉద్యోగానికి తగిన కఠినత ఎన్నడూ ముఖంలో కనబడదు. రథం దిగుతుండగానే యూషును పరుగెత్తు తున్నట్లుగా అడుగులు వేసుకుంటూ పోతీఫరు యొద్దకు వెళ్ళాడు. ఇద్దరూ ఆప్యాయంగా కౌగిలించుకున్నారు. "ఎంతకాలమైంది మిమ్మల్ని చూసి?" అన్నాడు పోతీఫరు ఆనందంగా.

"మీ ఉద్యోగం ఫరో చక్రవర్తి హెచ్చించిన రోజున" అంటూ ఇద్దరూ గుడారంలోకి వెళ్ళారు. వియాన్ ద్రాక్షా రసం గ్లాసులు వారి ముందు ఉంచాడు. వారు విలువైన తివాచీల మీద కూర్చుని మాట్లాడుకుంటుంటే – తేనె, వేయించిన మాంసం, రొట్టెలు తీసుకొని యోసేపు లోపలికి వచ్చాడు. వస్తూనే రెండుచేతులతో గిన్నె పట్టుకొని కొద్దిగా వంగి నమస్కారం చేశాడు.

ఐగుప్తు సూర్యుడు మొదటిజాము దాటి రెండవ జాములో సగం దూరం ప్రయాణం చేశాడు. ఉదయం ఎర్రగా కన్పించిన ఎడారి ఇసుక, ఇప్పుడు వేడెక్కి కొంచెం పసుపు రంగులోకి తిరిగింది. ఒంటెల ముక్కులు వేడిగాలి తగిలే కొద్ది చిన్నగా, సరదాగా మొదలైన సంభాషణ – రాజుల మీదికి, సైన్యాల మీదికి, దేశాల మీదికి తిరిగి దొంగల మీదుగా జైళ్ళలోనికి ప్రవేశించింది. అక్కడ నుండి బానిసలు, వారి ధరలు మాట్లాడుకుంటుంటే వారి స్వరాలు కూడా పెద్దవిగా వినిపిస్తున్నాయి.

యూషునికి ఐగుప్తు భాష ఇంత ధారాళంగా వచ్చునని యోసేపు అనుకోలేదు. "యోసేపు!" అని పిలిచాడు. యోసేపు ఉలిక్కిపడి గబాగబా లోపలికి వెళ్ళి వంగి నమస్కారం చేసి నిలుచున్నాడు. పోతీఫరు కన్నార్పకుండా చూస్తున్నాడు.

"హెబ్రీయుడవా?" అడిగాడు పోతీఫరు.

"ఔను! యోసేపు మరల వంగి నమస్కారం చేశాడు. యూషును సంగతి అంతా చెప్పాడు. తర్వాత యోసేపును వెళ్ళమన్నాడు. తర్వాత పది నిమిషాలలో బయటకు వచ్చి రథం ఎక్కి వెళ్ళిపోయాడు పోతీఫరు. యూషును తన గుడారము లోనికి వెళ్ళిపోయాడు. అందరూ భోజనాలు చేసిన తర్వాత ఒంటెల మీదికి సామాను ఎక్కించారు. మూడవజాము అవుతుండగా గుంపు బయలుదేరింది. అది ఆఖరు ప్రయాణం! పల్లెలు, పట్టణాల నుండి సాగుతుంది.

రాజధాని పట్టణం చాలా దూరం ఉంది. ఇంత పెద్ద నైలునదికి – ఈ ప్రక్కన ముప్పైమైళ్ళు ఆ ప్రక్కన ముప్పై మైళ్ళు మాత్రమే – ముప్పై అయిదు వందలమైళ్ళు పొడవు,

దాదాపు డెభై మైళ్ళ వెడల్పులో మాత్రమే ఈ దేశం వ్యాపించి ఉంది. సముద్ర ముఖద్వారం వద్ద మాత్రం చాలా వెడల్పుగాను, ఏడు పాయలుగా చీలిపోయి విశాలంగా ఉంది. తాము విడిది చేసిన ప్రాంతం నుండి ఇరవై మైళ్ళు పడమరగా పోతే గోషెను పట్టణం వస్తుంది. గోషెను, దాని చుటుప్రక్కల ఉండే పొలాలు అతి సారవంతమ్మైనవి.

నైలునది నుండి కాలువలు తీసి పంటలు పండిస్తారు. ఈ కాలువనీటిని పొలాలకు సరఫరా చెయ్యటానికి గూడ పద్ధతి, నీటి చక్రము, ఏతాము పద్ధతులు ముఖ్యమైనవి. గూడ పద్ధతి అంటే ముక్కోణాకారంలో ఉండే తడిక గూడ లాగా అల్లి ఈ కొన ఆ కొన పొడుగాటి తాళ్ళతో కడతారు. ఇద్దరు మనుష్యులకు మధ్యలో నాలుగు తాళ్ళు ఈ గూడకు బంధింపబడి ఉంటాయి. నీటి కాలువ గట్టు మీద ఇద్దరు నిలబడియుండి గూడని నీటిలోకి విసురుతారు. ఆ గూడ వెంటనే నిండిపోతుంది. దాని బలంగా, వేగంతో ముందుకు లాగటంతో గూడలోని నీరంతా ఒక్కసారిగా పొలంలోకి పోయి చిన్న నీటి కాలువల ద్వారా పొలానికి సరఫరా అవుతుంది. ఈ విధంగా రెండు చేతులతో రెండు తాటి కొనలు అదేవిధంగా గూడ అవతలి వైపు కూడా మరొక వ్యక్తి రెండు తాళ్ళు పట్టుకొని ఇద్దరూ వెనక్కు బలంగా లాగటం ద్వారా గూడ నదిలోకి వెళ్తుంది. వెంటనే నీళ్ళు నిండినప్పుడు మరలా గూడవైపు ఇద్దరూ ముందుకు వంగితే గూడ పొలంలోకి వస్తుంది. ఈవిధంగా లయబద్ధంగా వెనక్కి ముందుకు వస్తూపోతూ ఉంటుంది. ఈ పద్ధతి నైలునది దగ్గర మానవుడు నివసించి, వ్యవసాయము ప్రారంభించిన రోజునే కనిపెట్టబడి యుంటుంది.

హిలాడాఫ్ పద్ధతి. దీనికి పశువులు అవసరం. గానుగ తిరిగినట్లుగా కాడిని పశువులకు కట్టి ఒక పొడుగాటి దూలంతో బావి మీదకు గాని, చెరువు గట్టు లోతట్టున కాని బంధించి ఉంటుంది. భూమి నుండి ఎత్తుగా ఒక చక్రంవంటి దానికి ఈ నీటి తెట్టెలు కట్టబడి ఉంటాయి. పశవులు బావి చుట్టూ తిరుగుతుంటే ఈ నీటి పాత్రలు భూమిలో నుండి నీటిని పైకి తెచ్చి పొలంలోకి నీళ్ళ కాలువ ద్వారా నీరు సరఫరా అవుతుంది.

మూడవ పద్ధతి ఏతాము తొక్కటం. ఒక బలమైన దూలం కాలువ ప్రక్కనే పాతబడి యుంటుంది. దానికి ఇరవై అడుగుల ఎత్తులో రెండు చివరలు సమానంగా ఉండి క్రిందికి పైకి తేలికగా కదిలేటట్లు దూలంకు మధ్యలో కట్టబడి ఉంటుంది. నీటి తట్టు ఉన్న దూలం చివరలో రేకుతో కాని, తోలుతో కాని చేయబడిన ఒక పెద్ద పాత్ర బిగించబడి ఉంటుంది. దీని క్రింద భాగం నీరు వదిలి వేయటానికి వీలైన తోలుగొట్టం పాత్ర క్రింద ఉంటుంది. అడ్డంగా కట్టబడిన దూలం యొక్క రెండవ కొనకు ఏదైనా రాతి బరువు కట్టబడి ఉంటుంది. అవసరాన్ని బట్టి ఈ అడ్డంగా కట్టబడిన దూలంపై ఉన్న మనుష్యులు ఈ కొననుండి ఆ కొనకు నీళ్ళు నేల మీదకి ప్రవహించేటట్టు చేస్తారు.

గోషెను పట్టణం యొక్క సారవంతమైన నేలను బట్టి పశువులకు సమృద్ధికరమైన మేత సమకూర్చబడుతుంది. ఐగుప్తు దేశానికి తూర్పున ఉన్నందువలన 'గోషెనును దర్శించనిదే సూర్యుడు మహారాజైన ఫరోను దర్శించడు' అని మనుష్యులు గోషెనును మెచ్చుకుంటారు. ఫరో యొక్క పశువులన్నీ దాదాపు గోషెనులోనే ఉంటాయి.

ఐగుప్తు ప్రజలు ముఖ్య దేవుడు ఓను. అంటే సూర్యుడు! ఐగుప్తు ప్రజలు పూజించని జంతువులు కాని, పశువులు కాని, గ్రహాలు కాని లేవు. పురాతనమైన ప్రతి దేశము – హిందూ దేశము, చీనా దేశము, బబులోను, అష్షూరు అందరూ ఐగుప్తులాగా అనేకమంది అనగా ఒక మాటలో చెప్పాలంటే మనకు అవసరమైన ప్రతిదానిని మనం భయపడే ప్రతిదానిని పూజించారు. అందులో ఓను యొక్క దేవాలయానికి ముఖ్యస్థానం వస్తుంది. సూర్యునికి అతి ముఖ్యమైనది గోషెను కనుక ప్రజలు గోషెనులో నివసించ టానికి ఇష్టపడేవారు. కాని గోషెను దేశంలో ప్రజలు నివసించటానికి ఏ ఫరో కూడా ఇష్టపడనందున ఆ దేశము పశువులకు విడిగాను, సారవంతమైన పశుగ్రాసాలకుగాను కేటాయించబడినది.

ఈ ప్రాంతంలోనే సంపద స్థావరాలు అనే పట్టణాలు కట్టించాలని ప్రతి ఫరో ఆశపడుతుండేవాడు. ఈ సంపద స్థావరాలలో ఐగుప్తులో పండిన ధాన్యమంతా నిల్వచెయ్యాలని కోరుకుంటున్నా, వాటిని నిర్మించటానికి సరిపడే మనుష్య సంపద వారికి అందుబాటులో లేదు. కూషు దేశం నుండి అప్పుడప్పుడు బానిసలను తీసుకొచ్చే పెద్దపెద్ద పడవలలో బానిసలను తెచ్చినా వాళ్ళింకా ఐగుప్తులోని ఘనుల ఇళ్ళలోని పనులకు సరిపోతున్నారు. ఈ మధ్యకాలంలో బానిసల వ్యాపారం బాగా ఉంది. బానిసలకు మంచి గిరాకి పెరిగింది. కూషుదేశపు బానిసలు మొరటు పనులకు పనికి వస్తారు. అంటే పెద్ద పెద్ద భవనాలు, స్థూపాలు కట్టటానికి, పశు వులకన్నా గొప్ప పశుబలంతో పనిచేస్తారు. కానీ సాధారణంగా వారిని నమ్మటానికి వీలులేదు. కొంచెం వీలు చిక్కితే తప్పించుకొనిపోతారు.

అందరూ, అన్ని ఒంటెలు బయలుదేరేటప్పటికి పగలు నాల్గవజాము మొదలైనందువల్ల నోపు పట్టణం చేరేసరికి రాత్రి రెండవజాము కావచ్చును. చల్లగానే ఉంది. దూరంగా కొండలు–నడిచేకొద్దీ, దగ్గరికి చేరేకొద్దీ పెద్దవి అవుతున్నాయి. ఇపుడు ప్రతిమైలుకు ఒక గ్రామం నిండా జనం. సస్య శ్యామలమైన ఈ గోషెను ఇప్పుడు దాటుతున్న నైలునది సమీపంలోకి వచ్చే కొద్దీ అద్భుతమైన నోపు పట్టణం కనబడు తుంది. ఈ పట్టణం మీదకి వంగి, కావలి కాయుచున్నట్లుగా పెద్దపిరమిడ్ నిలబడి ఉంది. సూర్యుడు ఇప్పుడు కొండల వెనుకకు పశ్చిమాన వాలేటప్పుడు కొండ వెనుకకు పోయినట్లుగా కాక ఆ పెద్ద పిరమిడ్ వెనుకకు వంగినట్లుగా కనిపిస్తుంది.

సాయంకాలం అయ్యే కొద్దీ పక్షుల అరుపులతో ఆ గ్రామాలన్నీ గోల గోలగా అవుతున్నాయి. తాటిచెట్లు ప్రతీ గ్రామంలో వేలసంఖ్యలో నిండి ఉన్నాయి. అప్పుడప్పుడు సైనికుల రథాలు బహువేగంగా భయం పుట్టించి వెళ్తున్నా యి. ఒక రథంతో పాటు కొందరు ముందు పరుగెత్తు తుంటారు. వారి వెనకాల రథం, వెనక కొందరు రౌతులు ఉంటారు. వారు వెళ్ళిపోయిన తర్వాత దుమ్ము దారి ప్రక్కన ఉండే ప్రతి ఇంటినీ నింపేస్తుంది. పగలు నాల్గవజాము ప్రవేశిస్తుండగా ముఖ్యపట్టణం పొలిమేరలోకి ప్రవేశించారు.

నోపు పట్టణం మెసపోతేమియాలోని బబులోను పట్టణం కంటే కూడా పురాతనమైనది. ఈ పట్టణం చుట్టుకొలత పదమూడు మైళ్ళు. అయిదు నుండి ఆరు అంతస్తుల వరకు కట్టడాలు, దేవాలయాలు. నోపు పట్టణ మంతా దాదాపు దేవాలయాలతో నిండి ఉంది. ప్రతి దేవాలయం యొక్క ముఖద్వారం వద్ద ఇరవై అయిదు ఫరో విగ్రహాలు నిలువెత్తున నిలువబెట్టబడి ఉంటాయి. అమాన దేవత ఆలయాలే కాక, పశువులకు, పాములకు, చివరకు మొసళ్ళకుకూడా ఆలయం ఉన్నది.

ఈ ప్రయాణంలో వియాన్ ఏమి మాట్లాడకుండా కూర్చున్నాడు. మొదట్లో యోసేపు నోపు పట్టణం యొక్క దర్పము చూడటంలో మునిగిపోయాడు.

**(సశేషం)**


**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా**
**చందా పంపించాలంటే**
**ఈ క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra

# నా చిత్తానుసారుడు



(దావీదు జీవిత చరిత్ర)

- కొడవటికంటి

''రాజు కోరిన ఓలి విషయం యోనాతానుకు తెలియచేయవద్దు" అన్నాడు అబీషై.

"ఎందుకు? మేమిద్దరం నిబంధన చేసుకున్నాము కదా! చెప్పకుండా ఎలా ఉండ గలను?" అన్నాడు.

"యోనాతాను యొక్క సున్నిత హృదయం ఈ విషయం సహించలేదు" అన్నాడు అబీషై.

దావీదు ఆలోచించి "నిజమే" అన్నాడు.

"ఈ కార్యక్రమం మనం ముగించిన తర్వాత ఫిలిష్తీయుల సర్దారులకు నిజం తెలిసిపోతుంది. అదీకాక నువ్వు చెప్పినట్లు కొనన్యా నమ్మదగని వ్యక్తి అన్నావు కాబట్టి ఇది రహస్యంగా ఉండాలి" అన్నాడు అబీషై.

"కాలము ఒక మంచి స్నేహితున్ని, తనకు దూరం చేసింది" అనుకున్నాడు. అబీషైని చూస్తూ మరలా ఏనాటికైనా అబీషైతో కలసి అడవులలో హాయిగా తిరగ గలనా? అని అనుకొన్నాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?" అన్నాడు అబీషై.

"ఏమి లేదు. మన గొఱ్ఱెల మందలు గుర్తుకు వచ్చాయి. ఎంత నిశ్చింత అయిన జీవితానికి దూరమయ్యాను" అన్నాడు దావీదు.

"సరే, ఇప్పుడు ఎటువైపుగా వెళ్దాం" అన్నాడు అబీషై.

"ఎగ్లోనుకు వెళ్దామా?" అన్నాడు దావీదు.

"లిబ్నా అయితే మనకు కావలసినవి తీసుకొనగానే లాకీషు వారికి ఈ సంగతి వినబడకముందే మనం ఎయిలాను కొండల క్రిందకు చేరవచ్చును. అప్పుడు తెల్లవారిన మనం గిబియాకు దగ్గరలో ఉంటాము" అన్నాడు అబీషై.

మరునాడు ఉదయం సౌలు రాజు దర్శనం కొరకు అడిగాడు. ఉదయం పదిగంటలకు అబీషై రాజు అడిగిన ఓలి సంచిలో పట్టుకొని రాగా దావీదు సౌలు సమక్షంలో నిలిచాడు. జరిగిన సంగతి సౌలుకు తెలియదు. దావీదు ఏమి చెబుతాడో అని సౌలు చూస్తుంటే దావీదు మర్యాద పూర్వకంగా వంగి నమస్కరించి "వివాహ విషయంలో మీరు కోరిన ఓలి తెచ్చాను" అన్నప్పుడు సౌలుకు వెంటనే అర్థము కాలేదు. కాని వెంటనే తేరుకొని "ఫిలిష్తీయ దేశము వెళ్ళావా?" అన్నాడు.

"రాత్రి వెళ్ళి ఉదయాన్నే వచ్చాను. పరిచారకులను పిలిచి లెక్కించ మనండి" అని ఆ సంచి అక్కడ వుంచి అబీషైతో కలసి బయటకు వచ్చాడు.

నాలుగు రోజుల తర్వాత గిబియా నుండి అబ్నేరు, షేలహు మరి కొందరు ముఖ్యులు బయలు దేరి బేత్లెహేము లోని యెష్షయి ఇంటికి వచ్చారు. ఆ రోజంతా బేత్లెహేము గ్రామమంతా కోలాహలంగా ఉంది. దావీదు వివాహము రాజకుమార్తెతో.

యెష్షయి చాలా వృద్ధుడు. అయినా బాగానే మాట్లాడు తున్నాడు. వినికిడి బాగానే ఉన్నది. యెష్షయి ఇంట్లో అందరు చాలా సంతోషంగా ఉన్నారు. వచ్చిన వారికి విందు ఏర్పాట్లన్నీ సౌలు సైన్యంలో ఉన్న దావీదు అన్నలు ముగ్గురూ చూస్తున్నారు.

యెష్షయి మనసు అంత సంతోషంగా లేదు, విచారం గాను లేదు. బెన్యామీనీయులతో సంబంధం. తన చిన్న తనంలో బెన్యామీనీయులతో ఇశ్రాయేలు గోత్రములన్నీ కలసి చేసిన యుద్ధం జ్ఞాపకమునకు వస్తుంది. బెన్యామీనీయులు చేసిన ఘాతుకం.

ఎఫ్రాయీమీయుడైన లేవీయుడు ఈ బేత్లెహేము గ్రామమునకు చెందిన తన భార్యతో ప్రయాణమై వస్తూ దారిలో గిబియాలో బస చేసినప్పుడు గిబియోనీయులు ఆ స్త్రీకి చేసినది, ఆ తర్వాత బెన్యామీనీయులతో జరిగిన యుద్ధములో కత్తి దూయగలిగిన నలభైవేలమంది శూరులు చనిపోయారు. అప్పుడు బెన్యామీనీయులకు మిగిలిన గోత్రముల వారెవరూ తమ కుమార్తెలను వివాహమునకు

ఇవ్వకూడదని మిస్పాలో దేవుని ఎదుట ప్రమాణం చేసి కొన్నారు. కాని కాలక్రమంలో ఇవన్ని మరచిపోయారు. ఆ సంఘటనలు ఎరిగిన తనలాంటి వృద్ధులకు మాత్రమే తెలుసు.

గిబియోనులో తన ఆఖరు కూమారుని వివాహం. అది ఎవరితోనైతేనేమి తనకు సమ్మతంకాదు కాని దాని నెదిరించ టానికి తనకు మనస్సులేదు. యెష్షయి మౌనంగా ఉన్నాడు. జరగవలసిన తతంగమంతా పూర్తి అయిన తర్వాత అబ్నేరు, ఆయన అనుచరులు గిబియా తిరిగి వెళ్ళిపోయారు.

వివాహం జరిగిన తర్వాత మీకాలుకి ఏర్పాటైన ఇంట్లోనే దావీదు మకాం మార్చబడినది. సౌలు ఊహించిన విధంగా మీకాలు దావీదుకు ఉరిగా లేదు. పైపెచ్చు దావీదును ఒక్క క్షణమైన వదలి ఉండలేనంత ప్రేమగా ఉన్నది. రాజుగారి అల్లునిగా ఇప్పుడు ప్రజల మనస్సులలో దావీదు చాలా ఎదిగిపోయాడు. ఇది చూసి సౌలు దావీదును ద్వేషించిన దానికంటే అతనికి ఎక్కువగా భయపడ్డాడు.

రెండు నెలలు గడిచిన తర్వాత ఫిలిష్తీయుల సర్దారులు బయలుదేరి వచ్చారు. వివాహం చేసికొనిన యువకుడు ఒక సంవత్సరం వరకు యుద్ధమునకు పోనవసరం లేదని ఇశ్రాయేలీయుల కట్టడి. అయినప్పటికి దావీదు ఫిలిష్తీయు లతో యుద్ధమునకు వెళ్ళి బహు వివేకం కలిగి ప్రవర్తించుచు వచ్చాడు. సౌలు సేవకులందరికంటే, అతని పేరు బహు ప్రసిద్దికెక్కినది.

తనకు ఊహ తెలిసినప్పటినుండి తాను రాజు కుమార్తె. అక్క మేరబు తనకంటే పెద్దదైనా, అన్ని సమయాల్లో తనకంటే చిన్నదానిలా ప్రవర్తిస్తుంది. తనకంటూ ఏ ఆశలు కోరికలు ఉండేవికాదు. పెండ్లి అయిన తర్వాత అత్తగారింటికి సంతోషంగా వెళ్ళిపోయింది.

కాని తనను అత్తగారింటికి పంపే ఆలోచన తన తండ్రికి ఉన్నట్లు అనిపించటం లేదు. పైపెచ్చు తన పెనిమిటి ఇక్కడే ఉద్యోగం చేస్తున్నందు వలన బేత్లెహేము వెళ్ళాలని లేదు. తన తండ్రి తరపున తల్లి తరపున తనను పెండ్లాడాలని కోరుకొనేవారు బెన్యామీనీయులలో యౌవ్వనులు ఉన్నా తన వైపు కన్నెత్తి చూసే ధైర్యం ఎవరికి లేదు. దావీదు కూడా తనను చూడగానే అంతకు ముందు ఎన్నడూ ఏ స్త్రీని చూడని వానివలె భావన పొందాడని తన హృదయం చెబుతుంది. ఆయన ఎన్నడూ చొరవ తీసుకొనలేదు. ఒక పరిస్థితిలో ఆయన మేరబును పెండ్లి చేసుకొంటాడు అనుకుంది. దావీదు అన్నట్లు ఇది దైవనిర్ణయమే. తాను తన పెనిమిటితో ఎక్కువ ప్రేమగా ఉండటం తన తండ్రికి అంతగా ఇష్టం లేనట్లు అనిపిస్తుంది. దానికి కారణం ఏమిటో ఎంత ఆలోచించినా అర్థం కావడం లేదు.

ఫిలిష్తీయ సర్దారులు మాటిమాటికి దండెత్తి రావడం, దావీదు వారిని ఎదుర్కొని వారిని ఓడించి రావడం ఆయన తిరిగి వచ్చేవరకు తాను మంచినీళ్ళు కూడా ముట్టేది కాదు. తనకు దావీదు మీద ఉన్న ప్రేమ ఆయనకు తనమీద ఉన్న ప్రేమ యొక్క లోతు, వివాహమైన తర్వాతనే అనుభవం లోనికి వచ్చింది. అనుభవంలోనికి వచ్చిన తర్వాతనే ఎన్నో క్రొత్త విషయాలు తెలుసుకుంది. ఇతరులను గురించికాదు, తనను గురించి తనకు తెలియని విషయాలు తనలో ఇంతకాలం దాగి ఉన్నాయని అనుకొన్నప్పుడు సిగ్గువేసింది. అలా సిగ్గపడితే దావీదు భలే ఇష్టపడేవాడు.

తన పనికత్తె ఏడ్చుకుంటూ తన దగ్గరకు వస్తే జాలి వేసింది మీకాలుకు.

“విన్నీ, ఏమైంది నీకు?” అన్నది ఓదార్చుతూ. ఆ అమ్మాయి భయంతో వణకిపోతుంది. మీకాలుకి భయం వేసింది. కోపం వచ్చింది.

“సంగతి ఏమిటో చెప్పు” అని గదిమింది.

“రాజుగారు అయ్యగారిని చంపవలసినదిగా యువరాజు గారికి, తన సేవకులందరికి ఆజ్ఞ ఇచ్చారు” అని చెప్పింది ఏడుస్తూనే. మీకాలు గుండె దడదడలాడింది. వెంటనే లేచి తండ్రి దగ్గరకు వెళ్ళబోయింది. ముఖమంతా జేవురించింది, కోపంతో కళ్ళు పెద్దవైనాయి. విన్నీ మీకాలు చెయ్యి పట్టుకొని ఆపింది.

**(సశేషం)**

# సాక్ష్యము విశ్వాసంలో ఆఖరి మెట్టు

యేసు నామంలో హన్నాకృప పాఠకులందరికి నా వందనములు. నా పేరు హారిక. కొడవటికంటి సామ్యేల్ రాజేంద్రగారి రెండవ కుమారుని పెద్ద కుమార్తెగా, ఆయన మనవరాలిగా, తాతయ్యగారు తన చివరి రోజుల్లో మా దగ్గర ఉన్నందుకు ఎంతో సంతోషిస్తున్నాను. ఓ విశ్వాసిగా తన విశ్వాసాన్ని చివరి వరకు ఎలా కాపాడుకున్నాడో, కాపాడు కోవాలో తెలుసుకున్నాను.

చిన్నతనంలో తాతయ్య ఏదైనా కొనుక్కోవడానికి డబ్బులు అడిగితే ఇచ్చేవాడు, నేను ఏదైనా ఎగ్జామ్‌కి వెళ్ళేటప్పుడు తాతయ్య దగ్గరకు వెళ్ళి ప్రేయర్ చేయించుకోనేదానను. ప్రతిరోజు కుటుంబ ప్రార్థన పెడతాడు. నేను పెరిగేకొద్ది తాతయ్యతో దూరం పెరిగింది. కానీ తాతయ్య ఒక గొప్ప విశ్వాసని, గొప్ప రచయిత అని తెలుసుకున్నాను. తాతగారి గురించి తెలుసుకున్నాక ఆయన పుస్తకాలు అన్నీ చదివాను. ఆయన పుస్తకాలు అన్నీ అమూల్యమైనవి. తాతగారి బుక్స్ చదువుతుంటే అప్పటి కాలానికి ప్రయాణం చేసి, డైరెక్ట్‌గా చూస్తున్నట్లు అనిపించేది. మరి ముఖ్యంగా యేసుకథ, తిమోతి పుస్తకాలు చదివేటప్పుడు నాకు కన్నీరు ఆగలేదు.

2020లో జాన్‌వెస్లీ గారు తాతగారి పుస్తకాల గురించి చెప్పడం యూట్యూబ్‌లో వచ్చినప్పుడు దేవుడు తన బిడ్డలను ఎలా హెచ్చిస్తాడో తెలుసుకున్నాను.

ఒక విశ్వాసిగా యేసయ్యను డైరెక్ట్‌గా చూశాడు కదా తాతగారి లైఫ్ అంతా హ్యాపీగా ఉంటుంది అనుకునేదాన్ని. 2021లో తాతగారికి పక్షవాతం వచ్చి నడవలేని స్థితిలో తాతగారు వాకర్‌తో నడుస్తుంటే మా నాన్నగారు చాలా బాధపడేవారు. మా ఇంట్లో ఉండటం ఇష్టం లేకపోతే ఏదైనా ఓల్డేజ్ హోమ్‌లో చేర్పిస్తాను అక్కడ చాలామంది ఉంటారు, వారితో కాలక్షేపం అవుతుంది, వారికి వాక్యం చెప్పవచ్చు' అని తాతగారితో అన్నారు. తాతగారు సరేనన్నారు కానీ, మరలా ఆ విషయం ప్రస్తావించలేదు. అయితే ఒకరోజు అర్థరాత్రి తాతగారు మా ఇంటికి వచ్చి నాన్నగారితో ఈ రాత్రికి నేను మీ ఇంట్లో ఉంటాను ఉదయాన్నే ఓల్డేజ్ హోమ్‌లో చేర్చమని అడిగారు. నాన్నగారు తాతయ్యను ఓల్డేజ్‌హోమ్‌లో చేర్పించారు. ఓల్డేజ్ హోమ్‌లో క్రొత్త వాతావరణం, క్రొత్త వ్యక్తులతో పరిచయం, వారికి సువార్త చెప్తూ ఉంటే దేవునిపనిలో ఉంటారు కాబట్టి సంతోషంగా ఉంటారని ఆశించాము కాని ఎప్పుడూ అందరిని పలకరిస్తూ మాట్లాడే తాతయ్య అక్కడ ఉండలేక, తను ఇంతకుముందు ఎక్కడ ఉండేవారో అక్కడికే వెళ్ళిపోయారు.

మరల 2022 ఫిబ్రవరిలో మా నాన్నగారి వద్దకు వచ్చి నేను చనిపోవాలి అనుకుంటున్నాను అని చెప్పినప్పుడు మా నాన్నగారు తాతయ్యతో అదేంటి నాన్న మా దగ్గర ఉండు మేము చూసుకుంటాము నిన్ను అన్నారు. మా నాన్నగారు తాతగారి కొరకు ప్రత్యేకంగా ఒక గదిని సిద్ధం చేశారు. మా అమ్మగారు తాతయ్యను తన తండ్రి కంటే ఎక్కువగా చూసుకునే వారు. మా ఇంట్లో ఆయన పొందుకున్న ప్రేమనుబట్టి తాతయ్య చాలాసార్లు దేవునికి నేనంటే ఎంత ప్రేమ అని ఆనందించే వారు. దేవుడు ఆయనకు ఇచ్చిన ప్రేమనుబట్టి ఆనందంగా ఉన్నప్పటికి ఆయన హృదయంలో చాలా వేదన ఉండేది. కొన్నిసార్లు నడుస్తూ ఆగిపోయి ఏడ్చేవారు. ఏమైంది తాతయ్య అంటే వాళ్ళు చాలా దుర్మార్గులు అని చెప్పేవాడు అంతే. ఆ వేదన బాధ అంతా తన హృదయంలో ఉంచుకొని బాధపడే వాడు. 2022 నవంబర్ 1న మరల మా దగ్గర నుండి వెళ్ళిపోయారు. మీకు ఎందుకమ్మా ఇబ్బంది అని ఆలోచించు కొని, మేము ఆయనను పంపటం ఇష్టంలేక ఆపుతున్నామని వేరే ఊరికి వెళ్తున్నానని మరల వస్తానని చెప్పి ఇంటి నుండి వెళ్ళి ఒక నెల రోజుల పాటు వాళ్ళ తమ్మునితో ఉన్నారు. తరువాత రెండు నెలలు ఆయన ఇంతకు ముందు ఎక్కడ ఉండేవారో వెళ్ళి అక్కడ ఉన్నారు. ఈసారి వాళ్ళు మరి ఎక్కువ అవమానించడంతో మా అమ్మ శ్రీదేవి తప్ప ఆయనకు ఎవరూ లేరని తెలుసుకొని మరల ఫిబ్రవరి 2023లో వచ్చేశారు. ఇక్కడికి వచ్చాక తాతయ్య మా అమ్మని 'అమ్మా' అని పిలుచుకునేవారు.

తాతయ్య ఎంత బాధపడ్డాడో ఎక్కువగా చెప్పలేదు కాని

ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ బాధపడుతుండేవాడు. అమ్మ పిలవగానే ఉలిక్కి పడేవాడు. దేనికో చాలా భయపడి పోయారు తాతయ్య. ఆయన మాతో ఉన్న సంవత్సరన్నర కాలంలో తన బాధ మాతో చాలా తక్కువ పంచుకున్నాడు కానీ పరలోకంలో ఉన్న తన తండ్రితో ఎక్కువ చెప్పుకునేవాడు. నేను కాలేజీ నుండి సెలవులకు ఇంటికి వచ్చినప్పుడు హన్నాకృప పాఠకులకు నాతో ఉత్తరాలు రాయించేవాడు.

తాతయ్య జీవితం నుండి నేను నేర్చుకున్నది. తాత ఎప్పుడు ఎవర్ని ఇబ్బంది పెట్టకూడదు అని అనుకుంటారు. ఒక్కోసారి తన గదిలోనే బాత్రూంకి పోయేవారు. నడవలేకపోయినా ఏదో విధంగా శుభ్రం చేయడానికి ప్రయత్నించేవారు అప్పుడు అమ్మ 'మీరు ఇబ్బంది పడకండి నేను చేస్తాను' అని చెప్పి శుభ్రం చేసేది. ఆయన ఆఖరి రోజుల్లో అనారోగ్యంతో హాస్పిటల్లో ఉన్నప్పుడు ఆయనను చూడటానికి ఎవరైనా వస్తే ఎక్కువసేపు ఉండనిచ్చే వారు కాదు. ప్రేయర్ చేయించుకొని వెళ్లమనే వారు ఎవరూ ఇబ్బంది పడకూడదు అని.

ఏదైనా చెప్పేటప్పుడు విస్తారమైన మాటలు ఉండవు. ఒకటి రెండు మాటల్లో చెప్తారు అంతే.

తన తప్పు ఉన్నా లేకున్నా క్షమాపణ చెప్తారు. ఆయనకు ఉన్నదాంట్లో అందరికి సహాయం చేస్తారు.

ఒక విశ్వాసికి ప్రతి రోజు పరీక్ష ఉంటుంది. అన్నింటిని ఎదుర్కొని చివరి వరకు విశ్వాసాన్ని కాపాడుకోవాలి అని తెలుసుకున్నాను.

తాతగారు తన విశ్వాసాన్ని కాపాడుకున్నారు అని నేను నమ్ముతున్నాను. ఇక చనిపోతారు అనగా రెండు రోజుల ముందు పైకి చూస్తూ నవ్వుకుంటున్నారు. మా అమ్మ చూసి 'ఏంటి మామయ్యా' అని అడిగితే 'యేసయ్య కనిపిస్తున్నాడు' అని చెప్పారు. తాతయ్యనుబట్టి దేవుడు తన బిడ్డలని ఎలా ప్రేమిస్తాడో కూడా తెలుసుకున్నాను. తాత చనిపోవాలి అనుకున్నా, వెళ్ళి బయట ఉండాలి అనుకున్నా దేవుడు తన బిడ్డను వదులుకుంటాడా? తనను ప్రేమించేవారి దగ్గర ఉంచుతాడు. ఇందునుబట్టి దేవుడు సామ్యేల్ రాజేంద్రగారిని ఎంత ప్రేమించాడో తెలుసుకున్నాను. గుంటూరు హాస్పటల్ నుండి ఇంటికి తెచ్చిన తర్వాత మరుసటి రోజు చివరిశ్వాస వదిలే వరకు నేను ఆయన ప్రక్కనే ఉన్నాను.

ఎన్ని ఇబ్బందులు వచ్చినా, కష్టాలు వచ్చినా దేవుని విశ్వాసంలో ఎలా నిలకడగా ఉండాలో తెలుసుకున్నాను. తాతగారి విశ్వాస జీవితంలో 'చివరి మెట్టు' మా ఇల్లు అవ్వటం దేవుని సంకల్పంలో ఒక భాగము అని నమ్ముతున్నాను. ఆయన చివరి రోజుల్లో మేము ఆయనకు సేవ చేసే అవకాశం రావడం మాకు ఆశీర్వాదముగా భావిస్తున్నాను అందునుబట్టి దేవునికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

**'దేవుని ప్రేమించువారికి అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడిన వారికి మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవి' రోమా 8:28.**

## చందాదారుల వివరములు

1. అపో. ఎబినేజర్‌గారు (హైదరాబాద్)–1500 (నెలకు)
2. దాసరి శ్యామ్ హయ్యర్ పాల్ – 2000 (నెలకు)
3. గంధం డేవిడ్ నీలకాంత్ (నెల్లూరు) –1000 (నెలకు)
4. మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా 5000/–
5. ముద్ద సామ్యేల్ విల్సన్ – 500 (ప్రతి నెల)
6. జి. స్టాలిన్ (కావలి)
7. పాస్టర్ కంచెర్ల ప్రభుదాస్ (గుంటూరు)
8. సుమతి చక్రవర్తి
9. దాసరి. మాధవరావు
10. వి. రత్నమ్మ, హైదరాబాద్ 350/–
11. జి. కళావతి, ఒంగోలు 350/–
12. వి. కస్తూరి, భీమవరం 500/–
13. జయ, గుంటూరు – 1500/–
14. కె. రజిని, నరసరావుపేట – 1000/–
15. శ్రీమతి శాంతాగ్రేస్, మచిలీపట్నం 500/–
16. శ్రీమతి కె. కల్పన, గోవా – 350/–
17. శ్రీ జి. వెంకటేశ్వర్లు, కొత్తపల్లి – 350/–
18. శ్రీమతి సి. హెచ్. స్వయంప్రభ, చిలకలూరిపేట – 350/–

# నాన్నగారితో నా అనుభవము

మా నాన్నగారు ఎప్పుడూ ఒక మాట అనేవారు 'దేవుడు ప్రపంచాన్నంతా ఒక కంటితో చూస్తూ, నన్ను ఒక్కడినే ఇంకో కంటితో చూస్తుంటాడు' అని. దేవుడంటే ఆయన అంత విశ్వాసము కలిగి ఉండేవాడు. దేవుడు మా నాన్నగారి విషయంలో చేస్తున్న కార్యములను చూచినప్పుడు నాకు కూడా అలానే అనిపించేది, మాకు కనిపించే నాన్న వేరు, దేవునికి కనిపించే నాన్న వేరు, దేవుడు మానాన్నను ప్రత్యేకంగా చూస్తున్నాడేమో అని. ఒక మనిషి ఇంకో మనిషిలో లోపాలు మాత్రమే చూస్తాడు. కాని దేవుడు మాత్రం ఒక మనిషిలో కొంచెమైనా నీతినిజాయితీ ఉన్నాయా అని పరిశీలిస్తాడు. శరీర బలహీనతల విషయంలో ఆయన ఎన్నో పొరపాట్లు చేసినప్పటికీ, దేవునియందలి భయభక్తులు, విశ్వాసము విషయంలో నిజాయితీగా ఉండేవాడు. దేవుని మీద ఆధారపడి జీవించడం నేర్చుకున్నాడు కాబట్టే, ఆయన జీవితంలో ఆయనకు ఎదురైన చేదు అనుభవాలను ధైర్యంగా ఎదుర్కోగలిగాడు.

ఆయన దేవునియందు విశ్వాసంగా ఉండి, దేవుని మీద ఆధారపడి జీవించినప్పటికీ, ఈ లోకానుసారమైన జీవితాన్ని కూడా ఆయన వదలిపెట్టలేదు. దాని ఫలితంగా ఆయన ఎన్నో అవమానాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆయన జీవితంలో జరిగిన అనేక సంఘటనల మూలంగా ఆయన వివాహ, కుటుంబ జీవితం సక్రమంగా సాగలేదు. బహు భార్యాత్వం ఆయనకు నెమ్మదినివ్వకపోగా, ఆయనకు ఎన్నో అవమానాలను కలుగజేసింది. యాకోబు రాహేలును ఎంతో ప్రేమించి ఆమెకోసం 14 సం॥లు కష్టపడ్డాడు. లేయాను కానీ, జిల్పా, బిల్హాలను కానీ పెండ్లి చేసుకొనే ఉద్దేశం లేనే లేదు. అయినప్పటికీ వారిని పెండ్లి చేసుకోవాల్సి వచ్చింది. మా తండ్రిగారి జీవితంలో బహు భార్యాత్వం దేవుని చిత్తమో, స్వయంకృతాపరాధమో తెలియదు కానీ, దాని ఫలితం మాత్రం చాలా దారుణంగా ఉంది.

1993లో మా నాన్నగారు తాను చేసే గవర్నమెంటు ఉద్యోగము మానేసి, మా చర్చి ప్రక్కనే ఉన్న గదిలో ఆఫీసు ఏర్పరచుకొని దేవుని పని చెయ్యడం ప్రారంభించాడు. ఇండియా బైబిల్ లిటరేచర్ వారి ప్రాజెక్టులైన 'స్కూల్ ఆఫ్ ఇవాంజలిసమ్', 'అడల్ట్ లిటరసీ ప్రాజెక్ట్' వర్కుల్లో భాగస్వామిగా ఉండి ఆఫీసు నడిపించేవాడు.

1994లో ఒకరోజు నన్ను పిలిచి, ఆఫీసులో ఆయనకు సహాపడమని కోరాడు. అప్పటికి నాకు పెళ్ళి అయ్యి, ఒక కుమారుడు ఉన్నాడు. కుటుంబ పోషణ కోసం నేను ఒక ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేస్తున్నాను. తండ్రి మాటనుబట్టి నేను ప్రింటింగ్ ప్రెస్ పని మానేసి ఆఫీసులో నాన్నకు సహాయం చేస్తున్నాను. అప్పటికే నాన్న 'మడిమెను పట్టుకొనిన వాడు' అనే పుస్తకం వ్రాయడం ప్రారంభించాడు. అది పూర్తయ్యాక 'జప్నత్పనేహు', ఆసెనతు, అపొస్తలుడు' ఇలా వరుసగా పుస్తకాలు వ్రాస్తున్నాడు.

ఆ పుస్తకాలు ప్రింటింగ్ చేయించడం ఖర్చుతో కూడినది, పైగా అప్పట్లో ఆఫ్‌సెట్ ప్రెస్‌లు లేనందున, ప్రింటింగ్‌కి ఎక్కువ సమయం పట్టేది. నాకు ప్రింటింగ్ ప్రెస్ అనుభవం ఉన్నందున బ్యాంక్‌లో లోను తీసుకొని ప్రెస్ ప్రారంభించ మని నన్ను అడిగాడు. కానీ ప్రింటింగ్ ప్రెస్ నిర్వహణ చాలా కష్టమని నాకు తెలుసు కాబట్టి అందుకు నేను అంగీకరించలేదు. కానీ ఆయన నా మీద వత్తిడి తెచ్చినందున తండ్రి మాటను కాదనలేక, పి.యం.ఆర్.వై. పథకములో బ్యాంక్ లోను తీసుకొని 'హెచ్.కె.ప్రింటర్స్' (హన్నాకృప ప్రింటర్స్) పేరుతో ప్రెస్ ప్రారంభించాను. అదే సమయంలో నేను 'లా' డిగ్రీ చదవటం కోసం, ఒంగోల్లోనే ఇందిరా ప్రియదర్శిని లా కాలేజీలో చేరాను. ఒకేసారి ప్రెస్ పని, కాలేజీ, నాన్న ఆఫీసు పని చేయాల్సి వచ్చేది. నాన్నతో ఆఫీసులో పని చేసేటప్పుడు దేవుని విషయాలు లోతుగా చర్చించుకొనే వాళ్ళం. ప్రెస్ లోను తీర్చడం కోసం ప్రెస్‌లో ఎక్కువగా పని చేయాల్సిన పరిస్థితుల్లో కొంతకాలం ఆఫీసుకి రాలేకపోయాను.

2000వ సంవత్సరములో నాన్నకు తీవ్ర అనారోగ్యంతో మరణించాల్సిన పరిస్థితులు తలెత్తినప్పుడు, ఆయన మరణ

వార్త ఏ రోజు వినాల్సి వస్తుందోనని చాలా భయపడేవాడిని. అయితే దేవుడు ఆయనకు దర్శనములో కనబడి, ఆయనను మరణము నుండి తప్పించిన తర్వాత ఆయన సంపూర్ణముగా దేవుని పనికి అంకితమైపోయాడు.


అలాగే 1997లో నేను కంప్యూటర్ కొనుక్కొని డి.టి.పి. వర్క్ ప్రారంభించిన తర్వాత నాన్నగారి పుస్తకాలన్నీ కంప్యూటర్‌లో టైపు చేశాను. 2009లో ఒకేసారి నాలుగు పుస్తకాలు ప్రింటింగ్ చేసి, నేను నాన్న కలిసి బైండింగ్ చేశాము. అందుకు సుమారు నెలరోజుల టైం పట్టింది. ఈ నెలరోజుల్లో నేను, నాన్న బైబిలు విషయాలు ఎన్నో చర్చించుకొనే వాళ్ళం. హన్నాకృప పత్రిక కోసం నేను 'లోకంతీరు' అనే ఆర్టికల్ సీరియల్‌గా 12 నెలల పాటు వ్రాశాను. అది ప్రూఫ్ చూసేటప్పుడు నాన్న నన్ను చాలా అభినందించేవాడు. చాలా బాగా వ్రాశావు, నాకు తెలియని విషయాలు చాలా వ్రాశావు అని పొగిడేవాడు.

పుస్తకాల ప్రింటింగ్ చాలా భారంగా ఉన్నందువలన నాన్నగారికి బాగా సన్నిహితంగా ఉండేవారిని ప్రింటింగ్ కొరకు ఆర్థిక సహాయం కోరేవాడు. అది నాకు నచ్చేది కాదు, నాన్నతో 'వాళ్ళని వీళ్ళని అడగటం దేనికి, దేవుని పని కదా, దేవుడే చూసుకుంటాడు' అని చెప్పినప్పుడు 'సరే' అన్నాడు. నేను నాన్న దేవుని విషయాలు లోతుగా చర్చించుకొనే వాళ్ళం.

1999లో నేను 'నిత్యజీవజలము' పేరుతో క్రైస్తవ మాస పత్రిక ప్రారంభించాను. ఆచార్య ఆరార్కే మూర్తిగారి చేతుల మీదుగా ప్రారంభించబడిన పత్రికను పోస్టల్ రాయితీ లేకుండానే నాలుగు సంవత్సరాలు నడిపించాను. నాన్నగారు పత్రికకు ఆర్టికల్స్ వ్రాస్తుండేవారు.

2002 జూలైలో నేను 'యూత్ విత్ ఏ మిషన్'లో కోర్సు చేయడానికి చెన్నై వెళ్తూ పత్రిక బాధ్యతను నాన్నకి అప్పగించాను. పత్రికకు పోస్టల్ రాయితీ లేనందున, పోస్టల్ రాయితీ కోసం 2003లో పత్రిక పేరును 'హన్నాకృప'గా మార్చి నాన్నగారు ఎడిటర్‌గా రిజిస్టర్ చేయించారు. పత్రిక నేను ప్రారంభించినట్లు నాన్నగారు పత్రికలో ప్రింట్ చేశారు. అప్పటి నుండి 2022 వరకు నాన్నగారి ఆధ్వర్యంలోనే పత్రిక నడిపించబడింది. 2022 మే నెలలో పత్రిక బాధ్యతను తిరిగి నాకు అప్పగించాడు.

'నిత్యజీవజలము' పత్రికను అప్పట్లో నాకు చాలా భారంగా ఉన్నప్పటికీ కేవలం దేవుని మీద విశ్వాసంతో నడిపించాను. దేవునియందు నా విశ్వాసము వృద్ధిపొందటానికి పత్రిక ఒక కారణం అని చెప్పవచ్చు. ఎవరైనా స్వచ్ఛందంగా చందా ఇస్తే తప్ప నాకు నేనుగా ఎవరినీ చందా అడగలేదు. ఏ నెలకి ఆ నెల పత్రిక పోస్ట్‌లో వేయగలిగితే అదొక అద్భుతం అనిపించేది. నాన్నగారు పత్రికకు 'హన్నాకృప' అని పేరు మార్చిన తరువాత, నాన్నని నేను ఒక్క ప్రశ్న కూడా అడగలేదు. నాన్నగారి కోసమే దేవుడు నాచేత పత్రిక ప్రారంభింపజేశాడు అనుకున్నాను. నిత్యజీవజలము గురించి 2004 మే నెల సంపాదకీయంలో నాన్నగారు వ్రాసినది.


సంపాదకీయం

సంవత్సరా

హన్నాకృప పన్నెండవ సంచిక మీ చేతిలో ఉన్నది. ప్రభువు నామమునకు స్తోత్రము.

'నిత్యజీవ జలము' అనే పేరుతో నా రెండవ కుమారుడు ఇమ్మానుయేలు రాజేంద్ర గవర్నమెంటు వారి వద్ద నుండి డిక్లరేషన్ పొంది – పత్రికను ప్రారంభించి నడిపిస్తున్నప్పుడు – ఏదైన ఒక సంస్థ కాని, మరెవరైన సహాయం చేస్తుంటే నడిపిస్తున్నదేమో అనుకున్నాను.

ఒక సంవత్సరము గడచిన తర్వాత బజారులో తన ఇంటి కొరకు ఆ దిన భత్యము మాత్రము కొనటము చూసి – ఏ దినమునకు ఆ దినమే ఆహారం కొనుక్కొనే వాడు మాసపత్రికను ఎలా నడిపిస్తున్నాడో అర్థం కాలేదు. తర్వాత కేవలం విశ్వాస మూలముగానే నడిపిస్తున్నాడని తెలిసికొని నేను 'నిత్యజీవ జలము' మాసపత్రికలో క్రియాశీలక పాత్ర తీసికొనటం తటస్థించినది.

కుమారుడు సొంతగా డి.టి.పి. చేస్తూ – బజారులో ఆఫ్‌సెట్ ప్రెస్‌లో ప్రింటింగు చేయిస్తూ ప్రతి పత్రిక పోస్టు చేయుటకు ఒక్కదానికి నాలుగు రూపాయలు బుక్‌పోస్టు చెల్లిస్తుండేవారము.


పోస్టల్ కన్‌సెషన్ కొరకు డిపార్టుమెంటు వారిని సంప్రదించగా సరయిన సమాచారము అందలేదు. అలా రెండు సంవత్సరములు గడచిపోయినవి. ఒక్క నెల అయినా పత్రిక విడుదలవటం ఆగకుండా ప్రభువే నడిపించాడు.

'నిత్యజీవ జలము' మాసపత్రిక గత రెండు సంవత్సరాలుగా గవర్నమెంటు వారి న్యూస్ పేపర్సు రిజిస్ట్రార్ వారి వద్ద రిజిస్ట్రేషన్ చేయనందువలన –

మే- 04 3

# దేవుడు మనిషిలా చూడడు

ఒక మనిషి ఇంకో మనిషిలో లోపాలు మాత్రమే చూస్తాడు. ఎంత మంచి మనిషిలోనైనా, ఎంత నిజాయితీపరుడిలోనైనా తప్పులు ఏమైనా ఉన్నాయేమోనని భూతద్దం పెట్టి మరీ వెతుకుతారు. నిజాయితీగా జీవించే వారిని మెచ్చుకోడానికి రాని మనసు, తప్పులు వెదకటానికి ముందు ఉంటుంది. మనుష్యుల సహజగుణం అది. తనలోని తప్పులు కప్పిపుచ్చుకోడానికి ఎదుటి వారిలో లోపాలు కనిపెడు తుంటారు. కాని దేవుడు మాత్రం ఒక మనిషిలో కొంచెమైనా నీతినిజాయితీ ఉన్నాయా అని పరిశీలిస్తాడు. ఒక తెల్ల పేపరు తీసుకొని దాని మధ్యలో నల్లఇంకు పెన్నుతో ఒక చిన్న చుక్క పెట్టి, ఎవరికైనా చూపించి, దీనిలో నీకేమి కనబడుతుంది అని అడిగితే, నల్లమచ్చ కనబడుతుందని తడుముకోకుండా ఠక్కున చెప్పేస్తారు. నువ్వెంత నీతి నిజాయితీగా ఉన్నా, ఏదైనా చిన్న పొరపాటు చేస్తే మాత్రం, నీ మొత్తం నీతి నిజాయితీని పక్కన పెట్టి నువ్వు చేసిన చిన్న పొరపాటుని పదే పదే ఎత్తి చూపిస్తారు. కాని దేవుడు మాత్రం నిన్ను రక్షించటానికి నువ్వు ఎంత ఘోరపాపివైనా సరే, నీలో లేశమాత్రమైనా నీతి నిజాయితీ ఉంటే మాత్రం దేవుడు నిన్ను తప్పక రక్షిస్తాడు. మనుష్యులు చూచినట్లుగా దేవుడు ఎప్పటికీ చూడడు. మనుష్యులు మన హృదయంలో ఏముందో తెలుసుకోలేరు కాబట్టి మనల్ని అపార్థం చేసుకుంటారు. అయితే దేవునికి మన హృదయం స్పష్టంగా కనిపిస్తుంది. హృదయాంతరంగంలో మన ఆలోచనలు ఆయనకు తెలుసు కాబట్టి మనుష్యులు చూసినట్లుగా దేవుడు చూడడు. “పాతాళమును అగాధ కూపమును యెహోవాకు కనబడుచున్నవి. నరుల హృదయములు మరి తేటగా ఆయనకు కనబడును గదా?” (సామెతలు 15:11). దేవుడు సొదొమ గొమొఱ్ఱా పట్టణాలను నాశనం చేయడానికి ముందు అబ్రాముతో మాట్లాడేటప్పుడు అక్కడ పదిమంది నీతిమంతులున్నా సరే ఆ పట్టణాలను నాశనం చేయనని చెప్పటం మనం గమనించగలం. పదిమంది నీతిమంతులుంటే ఒక పెద్ద పట్టణము నాశనము కాకుండా రక్షింపబడితే, మనం మనతో పాటు కుటుంబము రక్షింపబడదా? మన యొక్క నీతి నిజాయితీ దేవునికి మాత్రమే తెలుసు. అబ్రాహాము దేవుని నమ్మెను అది అతనికి నీతిగా ఎంచబడెను' (రోమా 4:3). దేవుని నమ్మటం నీతి, దేవుని మీద ఆధారపడటం నిజాయితీ. ఈ రెండూ దేవుడు నీ నుండి నా నుండి కోరుకుంటున్నాడు. మనుష్యులు పైరూపమును, ఎత్తును, రంగును, వయసును చూసి ఎదుటి మనిషిపై ఒక అభిప్రాయానికి వస్తారేమో కాని దేవుడు మాత్రం హృదయం చూస్తాడు. ‘మనుష్యులు పైరూపమును లక్ష్యపెట్టుదురు గాని యెహోవా హృదయమును లక్ష్యపెట్టును' (1సమూయేలు 16:7). హృదయాన్ని మాత్రమే చూసే దేవుని నమ్మడం, ఆయన మీద ఆధారపడం మనిషికి ఎంతో శ్రేయస్కరం. కాబట్టి దేవున్ని హృదయ పూర్వకంగా నమ్మి, దేవునిపై ఆధారపడి నీతి నిజాయితీతో జీవిద్దాం. మన జీవితం మనుష్యులను బట్టి కాక దేవున్నిబట్టి నిజాయితీగా జీవిస్తే హృదయాలను చూసే దేవుడు మనకు ప్రతిఫలం ఇస్తాడు. మరి దేవున్నిబట్టి నీతిగా జీవించడానికి నీవు సిద్ధమా?



## హృదయపూర్వక కృతజ్ఞతలు

తేది 29-07-2023న జరిగిన **కొడవటికంటి సామ్యేల్ రాజేంద్రగారి ఆదరణ స్తుతికూడికకు** హాజరై మమ్ములను ఆదరించిన ‘హన్నాకృప పాఠకులకు, కొడవటికంటిగారి అభిమానులకు, బంధువులకు, స్నేహితులకు మా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేయుచున్నాను. **-ఎడిటర్, ఇమ్మానుయేలు రాజేంద్ర**

# కొడవటికంటిగారి శ్రమ దినములు

మా నాన్నగారైన కొడవటికంటి సామ్యేల్ రాజేంద్రగారు 'హన్నాకృప' చీఫ్ ఎడిటర్‌గా కంటే 'కొడవటికంటి' కలం పేరుతో అనేకమంది హృదయాలలో స్థానం సంపాదించు కున్నారు. బైబిల్లోని వ్యక్తుల చరిత్రను నవలా రూపకంగా వ్రాయడంలో ఆయనకు ఆయనే సాటి. నాన్నగారి రచనలు చదివిన ప్రతిఒక్కరూ చెప్పేదేమిటంటే 'కొడవటికంటిగారి రచనలు చదువుతుంటే, అప్పటి కాలానికి వెళ్ళి మేము కూడా ఆ కథలో భాగంగా ఉన్నట్లు అనిపిస్తుంది' అని. రచనల ద్వారా నాన్నగారికి లభించిన గౌరవం, ప్రేమాభిమానాలు ఆయన జీవితంలో మరువలేనివి. 2013లో అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిగారిచే 'ఉత్తమ క్రైస్తవ నవలా రచయిత' అవార్డుతో సహా ఎన్నో అవార్డులు అందుకొని, అనేకమందిచే సన్మానింపబడ్డాడు. దేవుడు నాన్నగారిని కొండ మీద ఉండు పట్టణంలా చాలా హెచ్చించాడు. మరి అంతటి పేరుప్రఖ్యాతులు సంపాదించు కున్న నాన్నగారి జీవితంలో చివరి మూడు సంవత్సరాలు ఎందుకు శ్రమలు పడాల్సి వచ్చింది?

నాన్నగారు తన గురించి వ్రాసుకున్న పుస్తకాలలో ఆయనకు ఎదురైన శ్రమలు, కష్టాలను గురించి వివరించే టప్పుడు ఆయనకు ఏదైనా కష్టం ఎదురైనప్పుడు ఆ కష్టాన్ని గానీ, శ్రమనుగానీ దేవుని కోణంలోనే చూసేవాడు. ఈ సంఘటన నా జీవితంలో ఎందుకు జరిగింది? దేవుడు ఎందుకు అనుమతించాడు? అని ఆలోచించేవాడు. బైబిలు గ్రంథములో దేవుడు ఆయన బిడ్డలైన వారిని చాలా సందర్భా లలో శిక్షించినట్లు, కష్టాలపాలు చేసినట్లు చూడగలం. నా యిల్లంతటిలో నమ్మకమైనవాడు అని చెప్పబడిన మోషేను, కనాను దేశములో ప్రవేశపెట్టకుండా శిక్షించాడు. నా చిత్తానుసారమైన హృదయము గలవాడు అని చెప్పిన దావీదును శిక్షించాడు. అసలు ఏ తప్పు చేయని యాకోబు కుమారుడైన యోసేపును కూడా కష్టాలకు అప్పగించాడు. దేవుని క్రియలను, ఆలోచనలను మన ఈ చిన్న మెదడు నిర్ధారించలేదు.

నాన్నగారు తన రచనల ద్వారా ఒక చరిత్ర సృష్టించాడనే చెప్పవచ్చు. అంతటి ఘనచరిత్ర కలిగిన 'కొడవటికంటి' గారిని దేవుడు శ్రమలకు, కష్టాలకు ఎందుకు అప్పగించాడో, దేవుని చేతమేమిటో మన మనసులో కలిగే భావాలనుబట్టి నిర్ధారించలేము.

2020లో నాన్నగారికి కరోనా వ్యాధి సోకిన తర్వాత, కొద్దిరోజులకు పక్షవాతము వచ్చింది. ఆయన చేరదీసిన కుటుంబ సభ్యులతో ఉన్న మనస్పర్ధల వల్ల నేను వెళ్ళి చూడలేని పరిస్థితి.

2021 డిసెంబరు నెలలో నాన్నగారు మా చర్చి దగ్గరకు ఆటోలో వచ్చి, వాకర్ పట్టుకొని దిగి, నడుచుకుంటూ చర్చిలోకి వెళ్ళడం చూశాను. ఆయన వాకర్ పట్టుకొని నడవడం మొదటిసారిగా చూశాను. ఆ స్థితిలో ఆయనను చూడటంతో నా మనసు చాలా కలచి వేసింది. అలాంటి స్థితి ఆయనకు వస్తుందని మేము ఎప్పుడూ ఊహించలేదు. 80 సం॥ల వయస్సులో కూడా సైకిల్ త్రొక్కగలిగినంత శక్తిమంతుడు, ఇప్పుడు ఇలా వాకర్‌తో నడవడాన్ని జీర్ణించు కోలేకపోయాను. కానీ అప్పుడు మా నాన్నగారితో నాకు దూరం పెరగటం వలన నేను ఏం చేయలేని స్థితిలో ఉన్నాను. అయినప్పటికీ ఆయనను చూచినప్పుడల్లా చాలా బాధపడే వాడిని.

2021 డిసెంబర్ నెలలో ఒకరోజు ఆయన చర్చిలో కూర్చుని ఉన్నప్పుడు నేను వెళ్ళి నాన్నతో మాట్లాడాను. 'మా ఇంట్లో ఉండటం నీకు ఇష్టం లేకపోతే, ఏదైనా ఓల్డేజ్ హోంలో చేర్పిస్తాను. అక్కడ చాలామంది ఉంటారు. వారితో దేవుని వాక్యము పంచుకోవచ్చు. నీకు కూడా టైంపాస్ అవుతుంది' అని చెప్పాను. 'సరే' అన్నాడు. మరుసటి రోజు నాన్నగారు వచ్చి చర్చిలో కూర్చున్నాడు. నేను నాన్న దగ్గరకి వెళ్ళాను. అప్పుడు ఆయన 'ఇదంతా ఎందుకు చేస్తున్నావు? ఆస్తి కోసమేనా?' అన్నాడు. ఆ మాటలకు నాకు చాలా ఆశ్చర్యమేసింది, బాధ వేసింది. మా తాతగారి ద్వారా వారసత్వంగా మా నాన్నకి సంక్రమించిన ఆస్తి ఆయన

తదనంతరం చట్టబద్ధ వారసులమైన నాకు, మా అన్న డేనియల్‌కి వస్తుంది. తాతగారి ద్వారా సంక్రమించిన ఆస్తి తప్ప నాన్నగారు వ్యక్తిగతంగా సంపాదించిన ఆస్తి ఏమీ లేదు. నాన్నగారు మాటలకు నేను బాధపడినప్పటికీ పట్టించు కోలేదు.

2021 డిసెంబర్ 2వ తేది రాత్రి 9-30కి మా చిన్నాన్న కొడుకు ఫోన్ చేసి 'పెదనాన్న వచ్చాడు, నీతో మాట్లాడాలంట, రా అన్న' అన్నాడు. అప్పుడు మేము క్లౌపేట, 2వ లైనులో అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉంటున్నాము. వెంటనే నేను చర్చి దగ్గరకు వచ్చాను. 'సావిత్రి, నతానియేల్ నన్ను ఇంట్లో నుండి పంపించేశారు, ఈ రాత్రి మీ ఇంట్లో ఉండి, ఉదయాన్నే ఓల్డేజ్ హోంకి వెళ్దాము' అన్నాడు. 'నడవలేని స్థితిలో ఉన్న నిన్ను ఇంత రాత్రిపూట ఎలా పంపించారు?' అన్నాను. 'ఏమో తెలీదు, నీ పెన్షన్ డబ్బులు మొత్తం ఇచ్చే పనైతే ఇంట్లో ఉండు లేదంటే వెళ్ళిపో అని చెప్పి ఆటో పిలిచి పంపించారు' అని చెప్పాడు నాన్న. ఆ రాత్రి నాన్నని ఇంటికి తీసుకెళ్ళి, ఉదయం ఓల్డేజ్ హోం చేర్పించడానికి అవసరమైన వస్తువులు కొనుక్కొని వెళ్ళాము. అక్కడ డిపాజిట్ కట్టి నాన్నని, నాన్నకి తోడుగా కుమార్ చిన్నాన్నని ఉంచాను. నేను ప్రతిరోజూ ఓల్డేజ్ హోం దగ్గరకి వెళ్ళి నాన్నని పలకరించేవాడిని, అది ఒంగోలుకి సుమారు 15 కి.మీ దూరంలో ఉండటం వలన అప్పుడప్పుడు నా భార్య, పిల్లలను తీసుకెళ్ళేవాడిని.

ఒకసారి నేను కుటుంబముతో హైదరాబద్ వెళ్ళి మూడు రోజులు ఉండి తిరిగి వచ్చేటప్పుడు నాన్న దగ్గరకు హోంకి వెళ్ళాము. కానీ నాన్న అక్కడ లేదు. హూం వాళ్ళని అడిగితే నరసరావుపేట వెళ్తున్నామన్నారు అని చెప్పారు. నేను నాన్నకి ఫోన్ చేస్తే కుమార్ చిన్నాన్న మాట్లాడాడు. నరసరావుపేటలో ఉన్నామని చెప్పాడు. ఎందుకు వెళ్ళారు అని అడిగితే ఏమో తెలీదు, యోగేశ్వరరావు రమ్మన్నాడంట అని చెప్పాడు. రెండు రోజుల తర్వాత నాన్న హోం దగ్గరకు వచ్చాడు. వెంటనే నేను వెళ్ళి, 'నిన్ను హోంలో చేర్పించింది, నువ్వు ప్రశాంతంగా ఉండాలనే కదా, నడవలేని స్థితిలో ఎందుకు నువ్వు ప్రయాణం చేసేది' అని అడిగాను. 'నేను ఇక్కడ ఉండలేను, మా ఇంటికి వెళ్ళిపోతాను' అన్నాడు. 'అర్ధరాత్రి అని చూడకుండా నడవలేని స్థితిలో ఉన్న నిన్ను పంపించేశారు కదా, మళ్ళీ ఎందుకు అక్కడకు వెళ్ళేది' అన్నాను. నాన్న ఏమీ మాట్లాడలేదు. మరుసటిరోజు లగేజీ అంతా హోంలోనే వదిలేసి ఆయన వెళ్ళిపోయాడు. సరే, 40 సం॥లు వాళ్ళతో కలిసి ఉన్నాడు కాబట్టి, వాళ్ళు ఏం మాట్లాడినా, ఏం చేసినా క్షమిస్తున్నాడేమో అనుకుని, హోంకి వెళ్ళి లగేజీ మొత్తం ప్యాక్ చేసుకొని ఇంటికి తీసుకొచ్చాను. హోం వాళ్ళకి కట్టిన డిపాజిట్ వాళ్ళు తిరిగి ఇవ్వలేదు.

తరువాత నాన్న మా చర్చి దగ్గర కనబడలేదు. నెల రోజుల తర్వాత తెలిసింది నాన్న, చిన్నాన్న ఎక్కడో ఇల్లు తీసుకొని ఉంటున్నారని. 2022 ఫిబ్రవరి 8వ తేది సాయంత్రం 4-30కి నేను మా చర్చి బయట ఉన్నాను, అప్పుడు నాన్న ఆటోలో వచ్చి నా ముందు ఆపి, 'నేను సూసైడ్ చేసుకోవాలి అనుకుంటున్నాను, ఏదో ఒకటి చెయ్యండి' అని అన్నాడు. నేను వెంటనే నాన్నకోసం సిద్ధం చేసిన గదిలో అన్ని వసతులు కల్పించాను. అప్పుడు నాన్న చిన్నాన్న ఆ గదిలో ఉన్నారు. 2వ లైనులో అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉంటున్న మేము ఏప్రిల్ 1వ తేది అపార్ట్‌మెంట్ ఖాళీ చేసి ఇక్కడికి వచ్చే వరకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం నాన్నకి, చిన్నాన్నకి భోజనం తీసుకొని వచ్చే వాడిని. నాన్న వచ్చినప్పుడు చాలా బలహీనంగా, కళ్ళు పీక్కుపోయి, బుగ్గలు లోపలికి వెళ్ళి, చాలా సన్నగా ఉన్నాడు. అందుకని ఆయనకి ప్రతిరోజు మాంసము, పాలు, గ్రుడ్లు, పండ్లు సిద్ధం చేశాము. అలా రెండు, మూడు నెలలు మంచి ఆహారం తీసుకున్న తర్వాత ఆయన కోలుకున్నాడు.

2022 ఆగష్టు 13న మా మేనత్త కొడుకు జెస్సీపాల్ ఇంట్లో ఫంక్షను జరిగితే నాన్న అక్కడకు వెళ్ళాడు. అక్కడ వాళ్ళు కనిపించి నాన్నని ఇంటికి రమ్మని చెప్పారంట. ఆగష్టు 15వ తేది బ్యాగ్‌లో ఒక జత బట్టలు పెట్టుకొని అక్కడికి వెళ్ళడానికి రెడీ అయ్యాడు. 'వద్దు నాన్న, ఇప్పటికి రెండుసార్లు ఇంట్లో నుండి పంపించేశారు కదా, మళ్ళీ ఎందుకు అక్కడికి' అని ఎంత చెప్పినా వినలేదు. అంతకు ముందు ఏప్రిల్ 23న నతానియేల్ నాన్నకు ఫోన్ చేసి చాలా అసహ్యంగా మాట్లాడాడు. 'నువ్వు మా దృష్టిలో

చచ్చిపోయినవాడివి. చచ్చిపోయిన వాడివి చచ్చిపోయిన వాడిలా ఉండు. మా యింటి సంగతులు, మా జోలికి మా పిల్లలు జోలికి రావద్దు దయచేసి. నువ్వు మాకు సంబంధం లేదు. పత్రిక విషయం, పుస్తకాల విషయం నీకు అనవసరం' అని చాలా ఛండాలంగా మాట్లాడాడు. ఆ ఫోన్ కాల్ నేను రికార్డు చేయడం జరిగింది. 40 సం॥లు వాళ్ళ కుటుంబాన్ని పోషించాడు అన్న కృతజ్ఞత లేకుండా 'అక్కడ కుక్కలాగా కాపలా కాస్తున్నావు' అని నీచంగా మాట్లాడాడు. అందుకే నాన్నని మరలా అక్కడికి పంపడం ఇష్టంలేదు మాకు. అంతేకాక నాన్న పుస్తకాల కోసం ఆశీర్వాదం అనే ఆయన్ని వాళ్ళ ఇంటికి పంపిస్తే అవమానకరంగా మాట్లాడటమే కాకుండా 'ఆయన్ను ఒక్కడినే రమ్మను, కొన్ని అగ్రిమెంట్లు మీద సంతకాలు చేయాలి' అని చెప్పాడంట. ఇలాంటి పరిస్థితుల్లో నాన్న అక్కడికి వెళ్ళడం అంత మంచిది కాదని భావించి మేము వెళ్ళనివ్వలేదు.

ప్రతి సంవత్సరం ఆగష్టు 17 నాన్న పుట్టినరోజున, హన్నాకృప వార్షికోత్సవం చేస్తారు. అప్పుడు హన్నాకృప పాఠకులు గానీ, నాన్న రాసిన పుస్తకాలను అభిమానించేవారు కానీ చాలమంది వస్తారు. నాన్న పుట్టినరోజు సంధర్భంగా బహుమతులు, డబ్బులు వస్తాయి. నాన్నని రెండుసార్లు ఇంట్లో నుండి పంపించేసిన వాళ్ళు, పుట్టిన రోజున మాత్రం ఇంటికి రమ్మని ఎందుకు పిలుస్తున్నారో నాన్నకు బాగా తెలుసు. అయినా కూడా వెళ్ళడానికి సిద్ధపడ్డాడు. ఆగష్టు 17 నాన్నగారి పుట్టినరోజు చర్చిలో గ్రాండ్‌గా చేద్దామని ప్లాన్ చేసినా, ఆయన అక్కడికి వెళ్తానని పట్టుపట్టడంతో పుట్టినరోజు చేయలేకపోయాము. నాన్నగారి పుట్టినరోజు అయిపోయాక అక్కడికి వెళ్ళాలన్న ఆలోచన మానుకున్నాడు.

తరువాత ఒకరోజు మా చిన్ననాన్న కొడుకు సామ్రాట్ కనబడి, 'సావిత్రమ్మ మా యింటికి వచ్చి, పెద్దనాన్నని వాళ్ళ యింటికి పంపవద్దని దండం పెట్టి చెప్పింది అన్న' అని చెప్పాడు. ఆ విషయం నాన్నకి చెప్పాను.

2020 సం॥ము ఆయనకి కరోనా వచ్చి, పక్షవాతము వచ్చేవరకు 80 సం॥ల వయస్సులో కూడా నెలలో 15 రోజులు హన్నాకృప పాఠకుల దగ్గరకు, కొడవటికంటి రచనల అభిమానుల దగ్గరకు ప్రయాణాలు చేసేవాడు. అందువలన ఆయనకు గదిలోనే కూర్చుని ఉండటం చాలా కష్టంగా ఉంటుంది. ఆయనకు పెన్షన్ వచ్చినప్పుడు అద్దెకారు మాట్లాడుకొని, మా చిన్నాన్నని తోడు తీసుకొని విజయవాడ, గుంటూరు, నెల్లూరు ఇలా ఆయనకు ఎక్కడికి వెళ్ళాలనిపిస్తే అక్కడికి వెళ్ళేవాడు.

82 సం॥ల వయస్సులో డైపర్స్ వాడుతూ, వాకర్‌తో నడుస్తూ ఊర్లు తిరగాల్సిన అవసరం ఏముంటుంది? నా భార్య శ్రీదేవి కన్నబిడ్డకంటే ఎక్కువగా చూసుకుంటుంది. ఏది కావాలంటే అది వండి పెడుతుంది. పూర్తి చేయాల్సిన పుస్తకాలు కానీ, ఇంకేదైనా ఒక పుస్తకం కానీ వ్రాస్తే బాగుంటుంది కదా అని నేను అనుకుంటాను. ఎంత చెప్పినా ఆయన ధోరణిలోనే ఉంటాడు. ఎవరు తోడు లేకపోయినా ఒక్కడే బయటకు వెళ్తాడు. ఎక్కడైనా పడిపోతాడేమో అని భయపడుతుంటాము.

2022 అక్టోబరు 7న నా కుమారుడి పెళ్ళి అయిన తరువాత, ఆయన బయటకు వెళ్ళడం ఎక్కువ చేశాడు. మేము కూడా ఆయనను ఆపడం లేదు. ఆ క్రమంలో నవంబరు 1వ తేదిన చీరాల వెళ్తున్నాను అని చెప్పి ప్రక్క వీధిలోనే ఉంటున్న మా చిన్నాన్న దగ్గరే ఉన్నాడు నాన్నగారు. మరలా మా దగ్గరకు రాలేదు. మేము కూడా ఆయన్ని పిలవలేదు. ఒక నెల రోజులు మా చిన్నాన్న దగ్గర ఉన్న తరువాత, మరలా వాళ్ళ ఇంటికి వెళ్ళాడు.

2023 ఫిబ్రవరి 22వ తేది మరలా మా యింటికి వచ్చాడు. సంవత్సరం క్రితం ఏ స్థితిలో వచ్చాడో, అంతకంటే బలహీనంగా ఉన్నాడు. ఆయన వెళ్ళిన తరువాత ఎలాంటి అవమానాలు, హింసలు పొందాడో తెలియదు కానీ, మానసికంగా చాలా కృంగిపోయాడు. ఆయన ఆరోగ్యం చాలా క్షీణించింది. ఆసుపత్రికి తీసుకెళ్ళి చూపించాము. బలానికి మందులు రాసిస్తే, అవి వాడుతున్నాము. సరిగ్గా అన్నం తినలేకపోతున్నాడు. ఈ సంవత్సరం ఎండలు విపరీతంగా ఉండటంతో, ఆయన గదిలో ఎ.సి. పెట్టించాం. ఎ.సి. పెట్టించాక హాయిగా నిద్రపోగలుగుతున్నాడు కానీ, ఎక్కువగా తినలేకపోతున్నాడు. జూన్ నెలలో 10వ తేది తర్వాత ఆయన కళ్ళు పచ్చగా కనిపిస్తున్నాయి. ఎండలకు అలా ఉన్నాయేమో అనుకున్నాను. ఆయన కళ్ళు పచ్చగా

ఉన్నాయి పసికర్లు అయ్యాయేమో అని చెప్పింది నా భార్య. 16వ తేది మధ్యాహ్నం నుండి ఆయనకు యూరిన్ రావడం లేదు. వెంటనే హాస్పిటల్‌కి తీసుకెళ్తే రక్త పరీక్ష చేసి, పసికర్లు ఎక్కువగా ఉంది, వెంటనే పెద్ద హాస్పిటల్‌కి తీసుకెళ్ళి సి.టి. స్కాన్ చేయించమన్నాడు డాక్టర్. యూరిన్ వెళ్ళడానికి పైప్ వేశారు. అక్కడ నుండి కిమ్స్ హాస్పిటల్‌కి తీసుకెళ్ళాము. ఐ.సి.యులో ఉంచి ట్రీట్‌మెంట్ ఇచ్చారు. పెద్ద వయస్సు కాబట్టి ఏమీ చెప్పలేము, నాలుగైదు రోజులు అబ్జర్వేషన్‌లో ఉంచాలి అన్నారు. అయినా పసికర్లకి అంత పెద్ద హాస్పిటల్లో ట్రీట్‌మెంట్ అవసరం లేదు, గవర్నమెంటు హాస్పిటల్లో అయినా చేస్తారని పెద్దలు చెప్పడంతో మరుసటిరోజు రిమ్స్ హాస్పిటల్లో అడ్మిట్ చేశాము. అక్కడ అన్ని రకాల టెస్ట్‌లు చేయించడానికి వారం రోజులు పట్టింది. గాల్‌బ్లాడర్‌లో రాళ్ళు ఉన్నాయి. సర్జరీ చేస్తే తప్ప పసికర్లు తగ్గవు, గుంటూరు తీసుకెళ్ళమని చెప్పారు డాక్టర్లు.

19వ తేది నతానియేల్ భార్య వాణి నాన్నను చూడ టానికి హాస్పిటల్‌కి వచ్చినప్పుడు నాన్న వాళ్ళని చూడటానికి ఇష్టపడలేదు. అయినా కూడా బలవంతంగా గదిలోకి వచ్చారు. అప్పుడు నాన్న 'మీరెవ్వరూ నన్ను చూడటానికి రావద్దు' అని వాణితోనే చెప్పాడు. వాణి వెళ్ళిపోయాక 'నేను చనిపోతే వాళ్ళు ఎవరూ నా శవాన్ని చూడటానికి కూడా రాకూడదు, ఇదే నా చివరి కోరిక' అని నా భార్య శ్రీదేవితో చెప్పాడు మా నాన్న.

జూన్ 24వ తేది రాత్రికి అంబులెన్స్ మాట్లాడుకొని గుంటూరు జనరల్ హాస్పిటల్‌కి వెళ్ళాము. అక్కడికి వెళ్ళే సరికి రాత్రి 2 అయ్యింది. అక్కడ కూడా కొన్ని టెస్ట్‌లు చేసి, అక్కడ బెడ్స్ ఖాళీ లేకపోవడం వలన సాయంత్రం 4 గంటల వరకు నాన్నగారు స్ట్రెచ్చర్ మీదనే ఉండవలసి వచ్చింది. నేను, నా భార్య, మా చెల్లెలు భారతి మా నాన్న దగ్గర ఉన్నాము. నాన్నకి బెడ్ దొరికిన తర్వాత మా చెల్లి ఒంగోలు వెళ్ళి, మరుసటి రోజు వచ్చింది. అక్కడ కూడా అన్ని టెస్ట్‌లు చేయడానికి నాలుగైదు రోజులు పట్టింది. జూలై 3వ తేది స్టంట్ వేస్తామని చెప్పారు. స్టంట్ వేస్తే పసికర్లు తగ్గుతాయని చెప్పారు.

జూన్ 28వ తేది వాళ్ళు నాన్నని చూడటానికి గుంటూరు వచ్చారు. వాళ్ళు రావడం మా నాన్నకి ఇష్టం లేదని తెలిసీ కూడా సావిత్రమ్మ, నతనియేల్, వాణి, పిల్లలు, మంజుల చిన్నమ్మ, మేరి పిన్ని కొడుకు ఆనంద్ నాన్న దగ్గరకు వచ్చారు. అప్పుడు నాన్న దగ్గర మా చెల్లెలు భారతి ఉంది. చావుబతుకుల్లో ఉన్న వ్యక్తిని చూడటానికి నీట్‌గా సిద్ధపడి, మల్లెపూలు పెట్టుకొని వచ్చిన సావిత్రమ్మను చూసి మా చెల్లెలు బైటకు వచ్చేసింది. వాళ్ళు కొంచెంసేపు ఉండి వెళ్ళిపోయారు. తర్వాత నా భార్య శ్రీదేవి, చెల్లెలు భారతి నాన్న దగ్గరకు వెళ్ళినప్పుడు 'వాళ్ళ ముఖం చూడటం నాకు ఇష్టంలేదు. వాళ్ళు ఎందుకు వచ్చారు. నాకు చాలా అవమానంగా ఉంది' అని నాన్న చాలా బాధపడ్డాడంట. వాళ్ళు నాన్నతో ఏం మాట్లాడారని ప్రక్కన బెడ్ వాళ్ళని అడిగితే 'ఏమో తెలీదండీ, ఆయన చెవిలో ఏదో మాట్లాడారు' అని చెప్పారు. ఆ రాత్రి నుండి నాన్నగారు స్పృహలో లేరు. మధ్యమధ్యలో ఉన్నట్టుండి 'పోండి, పోండి' అన్నట్లు చేతులు ఊపుతుంటాడు. పైకి చూస్తూ అమ్మా, అమ్మా అంటుంటాడు.

రెండు రోజుల తర్వాత పెద్ద డాక్టరుగారు వచ్చి చూచి, ఈ స్థితిలో ఉంటే స్టంట్ వేయడానికి కుదరదు. మీరు తీసుకెళ్ళాలనుకుంటే తీసుకెళ్ళండి అన్నాడు. అంతకు ముందు నాలుగు రోజుల నుండి ఇంటికెళ్దామని చాలాసార్లు అడిగారు నాన్నగారు. స్టంట్ వేస్తే పసికర్లు తగ్గుతాయి కదా అన్న ఆశతో మేము ఎదురు చూశాము. డాక్టర్ తీసుకెళ్ళమన్న తర్వాత ఇంక ఇంటికి తీసుకొచ్చాము. మరుసటిరోజు జూన్ 3వ తేది ఉదయం 10-55 ని.లకు నాన్నగారు దేవుని సన్నిధికి చేరారు.

నాన్నగారి ఆత్మీయం జీవితం ఎంతోమందికి ఆదర్శంగా ఉంది. ఆయన రచనల ద్వారా ఆకర్షితులై ఆయనను ప్రేమించేవారు రెండు తెలుగు రాష్ట్రాలలో అనేకమంది ఉన్నారు. అయినప్పటికీ నాన్నగారు 40 సం॥లు ఎవరినైతే పోషించాడో వారే ఆయనకు శత్రువులై, డబ్బు కోసం, ఆస్తికోసం ఆయనను మాటల ద్వారా, చేతల ద్వారా మానసికంగా, శారీరకంగా హింసించి, నాన్నగారికి పక్షవాతం రావడానికి కారకులయ్యారు.

ప్రత్యక్ష సాక్షులు చెప్పిన దాని ప్రకారం సావిత్రమ్మ ఒకసారి నాన్నగారితో "ఒరేయ్, నువ్వు ముసలోడివిరా,

నన్ను చేసుకొని నా జీవితం నాశనం చేశావురా" అని అంటే నాన్నగారు "చూడమ్మా, ఎలా మాట్లాడుతుందో" అని ప్రత్యక్ష సాక్షితో అంటే, సావిత్రమ్మ వచ్చి మూతి మీద, మూతి మీద కొట్టిందంట.

నాన్నగారు ఆయన అనుభవించిన నరకం గురించి మాతో స్వయంగా ఎన్నో విషయాలు చెప్పాడు. నాన్నగారు కూర్చుని ఉన్నప్పుడు నతానియేలు అటు వెళ్ళేటప్పుడు, ఇటు వెళ్ళేటప్పుడు నాన్నగారిని నెత్తి మీద కొట్టేవాడంట. 'నేనేమన్నా చిన్నపిల్లాడినా నెత్తి మీద కొట్టడానికి' అని ఏడ్చాడు నాన్న. ఇంకా చాలా విషయాలు చెప్పాడు. అవన్నీ రాయలేము.

నాన్నగారు 2020లో కరోనా రాకముందు వరకు నెలలో 15 రోజులు ప్రయాణాలు చేస్తూనే ఉండేవాడు. ఆయన రచనల ద్వారా, హన్నాకృప పత్రిక ద్వారా వచ్చే ఆదాయం, ఆయనకు వచ్చే 16,000 రూపాయల పెన్షన్ వారికి ఇచ్చినంత కాలం ఆయన బాగానే బ్రతికాడు. నాన్నగారికి పక్షవాతము వచ్చినప్పటి నుండి ఆయనకు కష్టాలు మొదలయ్యాయి.

వాళ్ళని చేరదీసిన 40 సం॥లలో ఉద్యోగపరంగా గానీ, హన్నాకృప పత్రిక, ఆయన రచనల ద్వారా గానీ వచ్చిన డబ్బంతా వారికే ఖర్చు పెట్టి, సమాజంలో వారికి ఒక హెూదా కల్పించిన నాన్నగారిని, ఆయన అనారోగ్యంతో నడవలేని స్థితిలో ఉన్నప్పుడు సూటి పోటి మాటలతో ఆయన హృదయాన్ని గాయపరచటం వలన నాన్నగారు చాలా కృంగిపోయారు. వాళ్ళకి జీవితాలను కల్పిస్తే చివరి రోజుల్లో వాళ్ళ ప్రవర్తన, మాటలు ఆయన చనిపోయే వరకు ఆయనను వేధిస్తూనే ఉన్నాయి. ఒకానొక సమయంలో ఆయన ఆత్మహత్య చేసుకోవడానికి పురికొల్పేటంత బాధలు ఆయన ఎదుర్కొన్నాడు. దేవుడు నాన్నగారిని ఎంతో ప్రేమిస్తున్నాడు కాబట్టి, చివరి రోజుల్లో ఆయన ప్రశాంతంగా చనిపోయే పరిస్థితులను కల్పించాడు దేవుడు.

దొంగల చేతిలో చిక్కి, దెబ్బలు తిని త్రోవ ప్రక్కన పడి ఉన్న వ్యక్తిని దారిన పోయే సమరయుడు, తనకు ఏ సంబంధం లేకపోయినా వానిని ఆదరించి, వాని మీద జాలిపడి వానికోసం తన సంపాదనలోని సొమ్ము ఖర్చు చేశాడు. అయితే 40 సం॥లు నాన్నగారి కష్టార్జితం తిని, ఆయన అనారోగ్యంతో ఉన్నప్పుడు, పక్షవాతం వచ్చి నడవ లేని స్థితిలో ఉన్నప్పుడు 40 సం॥లు మమ్మల్ని పోషించాడన్న కృతజ్ఞత లేకుండా మాటలతో, చేతలతో హింసించి, ఇంట్లో నుండి పంపించి వేసిన వారిని దేవుడు క్షమిస్తాడా?

నాన్నగారు ఎంతటి మనోవేదన అనుభవించి ఉంటాడో తలుచుకుంటేనే గుండెలు పిండేసినట్లు అనిపిస్తుంది. కన్నబిడ్డల కంటే ఎక్కువ విలువ ఇచ్చి, వారిని చదివించి, వారికి పెళ్ళిళ్ళు చేసి, వారిని ప్రయోజకులను చేస్తే, నన్ను ఇంతగా హింసిస్తున్నారని ఎంతగా కుమిలిపోయేవాడో మేము ప్రత్యక్షంగా చూశాము. నిజానికి వాళ్ళు ప్రేమగా చూసుకొని ఉంటే, 40 సం॥లు వాళ్ళతో ఉండి, ఇప్పుడు ఎందుకు ఉండలేకపోయాడు? నిజంగా ప్రేమించేవారి ప్రేమను ఎవరైనా కాదనుకోగలరా? నాన్నగారితో ఎలాంటి సంబంధం లేనివారు కూడా ఆయనను ఎంతో ప్రేమించే వారు. కానీ, ఆయన ఎవరి కోసమైతే అహర్నిశలు కష్టపడ్డాడో వాళ్ళు ఆయనకు శత్రువులయ్యారు. పైగా వాళ్ళేమంటారంటే 'ఆయన జీవితం మేము పెట్టిన భిక్ష' అని, వాళ్ళు లేకపోతే ఆయనకు జీవితమే లేదనట్లు మాట్లాడుతున్నారు.

నాన్నగారు మా దగ్గరకు వచ్చిన తరువాత ఆయన అనుభవించిన శ్రమలు మాతో పంచుకున్నది కొంచెమే. మేము బాధపడతామేమో అని చాలా విషయాలు మా దగ్గర దాచిపెట్టాడు. ప్రత్యక్షసాక్షులు మాతో చెప్పిన (ఆయనను కొట్టిన విషయాలు) విషయం నాన్న చెప్పలేదు. ఆయన జీవితంలోని చివరి మూడు సంవత్సరాలలో అక్కడ ఉన్న రెండు సంవత్సరాలు ఇంకెంత నరకము అనుభవించాడో నాన్నగారికే తెలియాలి.

ఇశ్రాయేలుదేశంలో ఎంతోమంది విధవరాళ్ళు ఉన్నా, ఏలీయాను సారెపతులోని విధవరాలి దగ్గరకు దేవుడు పంపినట్లే, నాన్నగారి జీవితంలోని చివరి సంవత్సరము మా దగ్గర ఉండేలా దేవుడు పంపించాడు. అది దేవుని ప్రణాళిక. ఎందుకంటే నా భార్య శ్రీదేవి నాన్నగారిని కోడలుగా కాక, బిడ్డలా, తల్లిలా ఆదరించింది. నాన్నగారిని మా దగ్గరకు తీసుకొని వచ్చిన దేవునికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.

# కొడవటికంటి సామ్యేల్ రాజేంద్రగారి గురించి...

తండ్రి : కొడవటికంటి కృపాదానం

తల్లి : కూచిపూడి హన్నమ్మ 12 మంది సంతానములో
జ్యేష్ఠకుమారుడు

ప్రాథమిక విద్య : 1947 విట్టికర్ గార్ల్స్ స్కూల్, సామర్లకోట,
తూ.గో జిల్లా

మాధ్యమిక విద్య: 7వ తరగతి, గొల్లపూడి హైస్కూల్,
మర్సపూడి, నూజివీడు, 1952–1957,
ఎ.బి.యం.హైస్కూల్, ఒంగోలు

పి.యు.సి. : 1958 ఎ.సి.కాలేజి, బాప్టిస్టు స్టూడెంట్స్
సెంటర్, కన్నావారితోట, గుంటూరు
(విలియంకేరి)

డిగ్రీ : 1959 బి.ఎ. 3 సం॥లు సి.యస్.ఆర్.శర్మకాలేజి,
ఒంగోలు (మొదటి బ్యాచ్)

ఎన్.సి.సి. : 'బి' సర్టిఫికేట్, శర్మకాలేజి, ఒంగోలు

ఉద్యోగం : 1961లో డి.యం.అండ్ హెచ్.యస్,
హైదరాబాద్‌లో జూనియర్ అసిస్టెంట్

వివాహము : 1964 జనవరి 4న వివాహము

---

★ ఒంగోలులో స్థాపింపబడిన క్లౌ యూనియన్‌నకు మొదటి ప్రెసిడెంట్ రావూరి కృపారావుగారు. తదుపరి మూడు పర్యాయాలు కొడవటికంటిగారు ప్రెసిడెంట్‌గా ఎన్నికైనారు.

★ 1963లో రామాయపట్నం బైబిల్ సెమినరీ యూత్ రిట్రీట్‌లో–మారిష్ బ్లాశ్చర్డ్ మరియు జి.ఆర్.క్రోగార్ల దైవ వర్తమానములో క్రీస్తును స్వరక్షకునిగా అంగీకరించుట

★ 1964లో ఒంగోలు టౌన్ సి.ఇ ర్యాలికి ప్రెసిడెంట్‌గా ఎన్నిక

★ 1964లో క్రొత్తపట్నం దేవునితోటలో అనాధ శరణాలయము ప్రారంభం.

★ 1965లో రెవ. బెంజిమెన్ కృపానిధి, రెవ. స్కాట్‌గార్ల గ్లాడ్ టైడింగ్స్ పబ్లికేషన్, కరీంనగర్ వారి సహకారంతో ఒంగోలులో క్రైస్తవ పుస్తకశాల స్థాపన.

★ 1966లో ట్రూత్ ప్రింటింగ్ ప్రెస్ ఒంగోలులో స్థాపన

★ 1972 ఆగష్టులో 'వరల్డ్ విజన్' ఆహ్వానం మేరకు అమెరికాలోని పాసడీనా, కాలిఫోర్నియా సందర్శన.

★ 1977-1979 భారతి ప్రింటింగ్ ప్రెస్ ఒంగోలులో స్థాపన (గవర్నమెంట్ గజిట్ ప్రింటింగ్).

★ 1992–1995 మద్రాసులోని ఇండియా బైబిల్ లిటరేచర్ వారి స్కూల్ ఆఫ్ ఇవాంజలిజమ్‌లో కరస్పాండెంట్‌గా మరియు లిటరసీ ఇండియా ట్రస్ట్ వారి వయోజన విద్య కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసరుగా సేవలు.

★ 1995లో 'మడిమెను పట్టుకొనినవాడు' తొలి పుస్తక రచన ప్రారంభం.

★ 1995–2019 వరకు వారి రచనలు మొత్తం 40 పుస్తకాలు ప్రచురించబడ్డాయి.

★ 1999 నుండి 'హన్నాకృప' మాసపత్రికను నడిపిస్తున్నారు.

★ చివరి పుస్తకము 'మిక్కిలి సాత్వికుడు' (మోషే కథ) ఇంకా ముద్రించబడలేదు



★ 1-5-2002న బెంగుళూరులోని 'గుడెషెపర్డ్ బైబిల్ కాలేజి' రెవ. డా॥ జి. రాజేశ్వరరావుగారి ద్వారా గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయబడింది.

★ 2012లో ఆల్ ఇండియా రేడియో డైరెక్టర్లుగా కొనసాగిన శ్రీమతి డా॥ ఝాన్సీ కె.వి.కుమారి, శ్రీ డా॥ నల్లూరి బాబూరావుగార్లు కొడవటికంటిగారి సాక్ష్యాన్ని రికార్డు చేసి

1-11-2012న ఆంధ్రప్రదేశ్ అవతరణ రోజున ఆల్ ఇండియా రేడియోలో ప్రసారం చేశారు.

★ 2-12-2012న హైదరాబాద్‌లోని శ్రీ పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో రెవ.డా॥ దాసుబాబుగారిచే పుస్తకావిష్కరణ మరియు సన్మానము.

★ 5-12-2012న డా॥ యన్. జయకుమార్‌రావుగారి ఆధ్వర్యంలో కవి, గేయ రచయిత శ్రీ జాలాదిగారిచే విశాఖ పట్నంలో సన్మానం.

★ 2001లో బిషప్ మూర్తోటి సంపత్ శాంతవర్ధన్‌గారిచే కొడవటికంటిగారి రెండవ నవల 'ఆసెనతు'ను చలనచిత్ర దృశ్యకావ్యంగా నిర్మించుటకు సన్నాహము జరిగినది. వారు మహిమ ప్రవేశము చేసిన తర్వాత వారి సేవకాడిని మోయు చున్న జ్యేష్ఠ కుమారుడు షాలి విక్రాంత్‌వర్ధన్‌గారు ఆసెనతు సినిమా నిర్మించుటకు పూనుకొని 25-12-20 తేదీన ప్రదర్శనకు సన్నాహము చేయుచున్నారు.

★ 21-12-2013న గౌరవనీయులు మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిగారిచే జూబ్లీహాలు హైదరాబాద్‌లో "గొప్ప క్రైస్తవ రచయిత" అవార్డు స్వీకరణ







## కొడవటికంటిగారి రచనలు

| | | |
|---|---|---|
| 1. | మడిమెను పట్టుకొనినవాడు | రూ. 40 |
| 2. | జప్నత్పనేహు | రూ. 45 |
| 3. | ఆసెనతు | రూ. 150 |
| 4. | అపొస్తలుడు | రూ. 60 |
| 5. | బర్నబా | రూ. 30 |
| 6. | తిమోతి | రూ. 40 |
| 7. | నా చిత్తానుసారుడు | రూ. 110 |
| 8. | గుంట నుండి మింటికి | రూ. 50 |
| 9. | విశ్వాసంలో ఓ మెట్టు | రూ. 60 |
| 10. | విశ్వాసంలో మరో మెట్టు | రూ. 65 |
| 11. | తోటలో పనివాడు | రూ. 20 |
| 12. | గోత్రకర్త (యాకోబు) | రూ. 50 |
| 13. | నా కుటుంబము | రూ. 25 |
| 14. | నా దూత (బాప్తిస్మమిచ్చు యోహాను) | రూ. 50 |
| 15. | నా కుమారి (రూతు) | రూ. 60 |
| 16. | నా స్నేహితుడు | రూ. 50 |
| 17. | అంత్యదినములలోని యదార్థ ప్రవక్త | రూ. 50 |
| 18. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -1 | రూ. 65 |
| 19. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -2 | రూ. 65 |
| 20. | ప్రయాణంలో ఓ మజిలి | రూ. 65 |
| 21. | నాజరు (సమ్సోను జీవిత చరిత్ర) | రూ. 65 |
| 22. | సువార్తలలోని యేసుకథ | రూ. 75 |
| 23. | యేసుకథ రెండవ భాగం | రూ. 75 |
| 24. | యేసుకథ మూడవ భాగం | రూ. 75 |
| 25. | జీవనమంతయు | రూ. 40 |
| 26. | టాల్‌స్టాయ్ కథలు 1 భాగము | రూ. 65 |
| 27. | టాల్‌స్టాయ్ కథలు 2వ భాగము | రూ. 65 |
| 28. | ఓ చినుకునవుతా... | రూ. 30 |
| 29. | పరలోకము - నరకము | |
| 30. | విశ్వాసము విజయము-1 | రూ. 70 |
| 31. | విశ్వాసము విజయము-2 | రూ. 70 |
| 32. | విశ్వాసము విజయము-3 | రూ. 70 |
| 33. | హదస్సా | రూ. 70 |

పుస్తకములు కావలసినవారు :
రెవ. డా॥ కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర
కృపాదానంగారివీధి, క్లౌపేట, 6వ లైను
ఒంగోలు-523001
ప్రకాశం జిల్లా, ఫోన్ : 9440217726

స్త్రీల విభాగం

# ఫీబే

హన్నాకృప పాఠకులకు యేసుక్రీస్తు నామంలో శుభాభి వందనములు. బైబిల్లో పేర్కొనబడిన అనేక మంది స్త్రీల జీవితాలను ధ్యానించుట ద్వారా హన్నాకృప పాఠకులు ఆత్మీయ మేలులు పొందుచున్నారని నమ్ముతున్నాము.

ఈ సంచికలో ఫీబే జీవితం మన ధ్యానాంశం. ఫీబే గురించి చాలా మంది క్రైస్తవులకు తెలియకపోవచ్చును. ఫీబే గురించి బైబిల్లో ఒకే ఒక వాక్యంలో చెప్పబడింది. రోమా 16:1లో మాత్రమే ఆమె గురించి చెప్పబడింది. ఆ ఒక్క వాక్యంలో నేటి క్రైస్తవ మహిళాలోకం జీవితంలో నేర్చుకోవలసిన పాఠాలు ఉన్నాయి.

అపొస్తలుడైన పౌలు రోమాలో ఉన్న క్రైస్తవ సంఘానికి ఉత్తరం వ్రాసి, ఆ ఉత్తరాన్ని ఫీబే అనే విశ్వాసికి ఇచ్చి పంపాడు. ఆమె గురించి పౌలు ఇచ్చిన సాక్ష్యం చాలా ప్రాముఖ్యమైనది. ఫీబే కెంక్రేయ ప్రాంత విశ్వాసి. కెంక్రేయ గ్రీసు దేశంలోని ఒక భాగం. గ్రీసు దేశానికి ఉన్నరెండుతీర ప్రాంతలలో తూర్పు తీరాన కొరింథు పట్టణం ఉండగా పశ్చిమ తీరాన కెంక్రేయ ఉన్నది. కెంక్రేయ తీరప్రాంతం ఆ కాలంలో ఒక మంచి వాణిజ్య కేంద్రంగా పేర్కొనవచ్చు. పాశ్చత్య దేశాలతో వ్యాపార వ్యవహారాలు అన్నీ కెంక్రేయ తీరం మీదుగా గ్రీసు దేశం దాటి రోమ్‌ను చేరేవి. బహుశా పౌలు కొరింథులో నివసించి నప్పుడు కెంక్రేయ ప్రాంతంలో సువార్త ప్రకటించి ఉండవచ్చు.

పౌలు ఫీబే గురించి చెప్తూ కెంక్రేయ సంఘ పరిచార కురాలు అని తన ఉత్తరంలో సంబోధించాడు. సంఘ పరిచారకురాలు అనే పదం అత్యున్నతమైన విలువను కలిగి ఉన్నది. నూతన నిబంధనలో సంఘపరిచారకులుగా పేర్కొన బడినది ఇద్దరే ఇద్దరు. వారిలో ఒకరు పౌలు, రెండవది ఫీబే అనే స్త్రీ. కొలస్సీ పత్రికలో పౌలు తనను తాను సంఘ పరిచారకునిగా పరిచయం చేసుకున్నాడు. కాబట్టి సంఘ పరిచారకురాలు అంటే ఈ కాలంలో చెప్పబడినట్లు సంఘంలో ఏదో ఒక పనిలో అంటే చర్చిని శుభ్రపరచటం, సభల సమయంలో వంట చేయటం వంటి పనులలో సహాయపడటం కాదు అని గమనించాలి. పౌలు ఉద్దేశంలో సంఘపరిచర్య అంటే అప్పటి పరిస్థితులను బట్టి సంఘమును ఏర్పరచుట అనవచ్చు. ఎందుకంటే పౌలు పని అదే. అనేక ప్రాంతాలకు సువార్తను అందించి వారిని క్రీస్తు శిష్యులుగా మార్చి సంఘమును ఏర్పరచి, విశ్వాసంలో ఎదుగునట్లు వారిని ఆత్మీయంగా బలపరచటం. అంటే ఫీబే కూడా ఇంచుమించు ఇవే బాధ్యతలు కలిగి ఉండవచ్చు. గ్రీకులో సంఘపరిచారకు రాలు అనే పదానికి సంఘకాపరికి సహాయపడుతూ సంఘాన్ని కాపాడే వ్యక్తి అనే అర్థాన్ని ఇచ్చే డీకన్ అనే పదం ప్రయోగింప బడింది. అంటే ఫీబే గురించి పౌలు చెప్తున్న సాక్ష్యం ఎంత గొప్పదో ఆలోచించండి. సంఘాన్ని కాపాడటం అంటే సంఘ సభ్యులు వేరే చర్చికి వెళ్ళకుండా ఆపడం కాదు, వారి విశ్వాసం దారి మళ్ళకుండా క్రీస్తును కలిగి ఉండునట్లు వారి ఆత్మీయ స్థితిని కాపాడటం, వాక్యం ద్వారా వారిని ఆదరించి క్రీస్తులో వారిని అంటుకట్టడం, సంఘపరిచారకురాలిగా ఇవన్నీ ఫీబే బాధ్యతలు. ఇన్ని బాధ్యతలు నిర్వహించుట, అందులోను సాక్ష్యము పొందునంత సక్రమంగా నిర్వహించుట సాధారణ మైన విషయం కాదు.

ఈ వాక్యంలో కొసమెరుపు ఏంటంటే సంఘంలో స్త్రీ మౌనంగా ఉండాలని చెప్పిన పౌలు, ఫీబే పరిచారకత్వాన్ని మెచ్చుకుంటున్నాడు అంటే ఆమె భక్తి జీవితం ఎలా ఉండి ఉంటుందో, ఎంత పవిత్రంగా ఉండి ఉంటుందో క్రైస్తవ స్త్రీల సమాజం సునిశితంగా ఆలోచించాలి. పౌలు వ్రాసిన పత్రిక 1తిమోతి 3:11లో పరిచారము చేయు స్త్రీలకు ఉండవలసిన లక్షణాలు, అర్హతలు చెప్పబడ్డాయి". అటువలె పరిచర్య చేయు స్త్రీలును మాన్యులై కొండెములు చెప్పనివారును మితానుభవము గలవారును, అన్ని విషయములలో నమ్మకమైన వారునై యుండవలెను". ఫీబే పౌలుచే సంఘపరిచారకురాలు అని చెప్పబడింది అంటే ఫీబేలో 1తిమోతిలో చెప్పబడిన అన్ని

లక్షణాలు ఉన్నాయని అర్థం చేసుకోవచ్చు.

గౌరవప్రదమైన ప్రవర్తన గలవారిని మాన్యత గలవారు అంటారు. మనుష్యుల మెప్పు ఆశించక దేవుడు చూస్తున్నాడనే ఎరుకలో జీవిస్తూ మంచి నడవడిక కలిగి, ఇంట్లోను సంఘంలోను మర్యాదపూర్వకమైన ప్రవర్తన కలవారని అర్థం.

మితానుభవము గలవారు అంటే నియంత్రణ శక్తి గలవారని. ఎటువంటి అనుభవమునైనను అతిగా కాక మితముగా అనుభవించాలి అనుకునేవారు. అన్ని విషయాలలో తృప్తి కలిగి జీవించగలిగిన వారు.

నమ్మకత్వం అనేది సమాజంలో మనిషి మనుగడకు ప్రాణవాయువు వంటిది అనవచ్చు. సమజంలో మనిషి జీవితం ఎన్నో రకాల బంధాలలో బాధ్యతలతో ముడిపడి ఉంటుంది. వాటన్నింటిలో నమ్మకత్వం అనేది చాలా ముఖ్యమైనది. అన్ని రకాల బంధాలలో నమ్మకం అనేది చాలా అవసరం. క్రీస్తును కలిగి జీవించే వారు కూడ క్రీస్తులో నమ్మకంగా ఉండాలి.

కొండెములు అంటే అబద్ధాలు లేదా చాడీలు అనవచ్చు. అటవంటి వాటికి దూరంగా ఉండగలగడం. ప్రతి ఒక్కరూ ఏదో ఒక సందర్భములో అబద్ధములు చెప్తుంటారు కానీ వాటికి దూరంగా ఉన్నవారు మాత్రమే నమ్మకత్వమును సంపాదించుకుంటారు. అబద్ధమాడు పెదవులు యెహోవాకు హేయములు అని పరిశుద్ధ గ్రంథం సెలవిస్తుంది.

ఫీబేలో పైన చెప్పబడిన మంచి లక్షణాలు ఉన్నందునే ఆమె పౌలుచే సంఘపరిచారకురాలని సంబోధించబడింది.

ఫీబే మనవలె ఒక సాధారణమైన స్త్రీ అయితే ఆమె ప్రత్యేకంగా జీవించింది. ప్రత్యేకంగా జీవించడం అంటే సమాజంలో అందరివలె, మన చుట్టు ప్రక్కల ఉన్న వారి వలె కాక దేవునికి నమ్మకంగా జీవించింది. ప్రవర్తనను కాచుకుంది. తనుండే కంక్రేయ చిన్న పట్టణమైనప్పటికి ఆనాటి వాణిజ్య కేంద్రం కాబట్టి ఎన్నో రకాల ఆకర్షణమైన లోకాశలు పాపాలు అందుబాటులో ఉండి ఉండవచ్చు. అయితే ఆమె మితానుభవం గలది. లోకంలో కలిగే నేత్రాశ, జీవపు డంబము, శరీరాశలను నియంత్రించు కోగలిగింది. దేవునికి హేయమైన లక్షణాలకు దూరంగా ఉంది. లోకపోకడలకు, సహజమైన శరీర తత్వాలకు వ్యతిరేకంగా జీవించడానికి వాక్య దిక్సూచిని ఆధారం చేసుకుంది. అభ్యాసం చేసింది. ఫలితంగా మంచి సాక్ష్యాన్ని పొందుకుంది.

నేటి క్రైస్తవలోకం సాక్ష్యం అనే పదానికి కొత్త భాష్యం చెప్తుంది. దేవుడు చేసిన మేలులు, మెరుగుపడిన ఆరోగ్య సమస్యలు, సంఘకాపరి పొగడ్తలు మాత్రమే సాక్ష్యంలో కనబడుతున్నాయి. దేవుడు చేసిన మేలులకు కృతజ్ఞత కలిగి ఉండటం అందులకు ఆయనను స్తుతించటం చాలా మంచి విషయం అయితే అది కేవలం చర్చిలో సాక్ష్యం చెప్పడం వరకే పరిమితమవ్వడం చాలా దుఃఖించదగ్గ విషయం. సాక్ష్యం అంటే వ్యక్తిగత జీవితం మారాలి. సమాజానికి వ్యతిరేకమైన ప్రవర్తన గలవారు తమ ప్రవర్తన మార్చుకుని మంచిగా బ్రతకటం సాక్ష్యం. మంచిగా ఉన్నవారు క్రీస్తు సారుప్యంలోకి మారడం, మారడానికి ప్రయత్నించడం సాక్ష్యం.

ఫీబే ఆరాధించిన దేవున్నే ఈ రోజు మనం ఆరాధిస్తున్నాం. ఆమె తన దేవునికి ఇష్టమైన ప్రవర్తన కలిగి ఉండాలని ఆశించింది కాబట్టి ప్రయాసపడింది మంచి సాక్ష్యాన్ని పొందుకుంది. నేటి క్రైస్తవ స్త్రీలు ఫీబేవలె దేవున్ని సంతోష పెట్టుటకు, ఆయన మెచ్చిన ప్రవర్తన కలిగి ఉండుటకు ప్రయాసపడుతున్నారా? లేక అందరివలే ఆచారపరమైన భక్తిని మాత్రమే కొనసాగిస్తూ, వ్యక్తిగతమైన పరివర్తనలో ఎటువంటి మార్పులేక, సంఘంలో అందరి వలె దేవుడు చేసిన మేలులను మాత్రమే సాక్ష్యముగా కలిగి ఉన్నారా? అనేది ప్రతి క్రైస్తవ స్త్రీ ఆలోచించవలసిన విషయం. “కాగా సైన్యములకధిపతియగు యెహోవా సెలవిచ్చునదేమనగా – మీ ప్రవర్తనను గూర్చి ఆలోచించుకొనుడి” హగ్గయి 1:7

## గమనిక

క్రైస్తవ కథలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మా ప్రియ పాఠకుల నుండి కోరదమైనది. ఆసక్తి గలవారు తమ తమ భావాలను మా పత్రిక ద్వారా పాఠకులకు అందించవచ్చు. ఉత్తమ కథకు నగదు బహుమానం వుంటుంది. క్రైస్తవకథ ఏదైనా 2 పేజీలకు మించకూడదు.

చిన్నపిల్లల పేజి

# అంతర్దర్శిని

ఒక ఆదివారం సండేస్కూల్‌లో నుండి వచ్చిన జాషువ పరిగెడుతూ తన తండ్రి వద్దకు వచ్చి సండేస్కూల్‌లో టీచర్ అందరూ పాపులే అని చెప్పింది. అందరూ పాపులమేనా డాడీ, అది నిజమేనా అడిగాడు అమాయకంగా. అవును జాషువా మనందరం పాపులమే. పుట్టడంతోటే మనం పాప స్వభావంతో పుడతాం. ఎవరు చెప్పకుండానే నేర్పించకుండానే అబద్ధాలు చెప్పడం చాడీలు చెప్పడం, ప్రక్కనవారి వస్తువులు ఆశించడం వంటివి మన జీవితంలో భాగమౌతాయి. అందుకే మనమందరం పాపులమే అన్నాడు తండ్రి. అలా అయితే ఎలా? మరి మనం యేసయ్య బిడ్డలం కాదా? అడిగాడు జాషువా. అందుకు తండ్రి మనకు దేవుడిచ్చిన విచక్షణతో ఆలోచించి ఆ పాపపు పనులకు దూరంగా ఉండగలిగితే మనం యేసయ్య బిడ్డలమే అన్నాడు. పూర్తిగా అర్థం కాక పోయినా అప్పటికి మౌనం వహించాడు జాషువ.

తాను కూడ యేసయ్య బిడ్డగా ఉండాలని నిర్ణయించు కున్నాడు జాషువ. తన ప్రవర్తన గురించి జాగ్రత్త వహించ సాగాడు జాషువ. తనకు ఏదైనా సందేహం వస్తే తన తండ్రిని అడిగేవాడు. జాషువ తండ్రికి సంఘంలో, ఇంట్లో, తోటి ఉద్యోగుల మధ్య మంచి సాక్ష్యము ఉన్నది. అందరూ ఆయనను గౌరవిస్తారు. అనాథ శరణాలయంలో పిల్లలకు సండేస్కూల్ నిర్వహిస్తూ దేవుని సువార్త ప్రకటిస్తున్నాడు. కాబట్టి జాషువ తన తండ్రిని చాలా దగ్గరగా చూడటం ద్వారా తనకు ఆయనే రోల్ మోడల్. ఎప్పటికైనా తండ్రిలా మంచి సాక్ష్యమును పొందుకోవాలి, నాన్నవలె తాను యేసయ్య బిడ్డగా ఉండాలి అనుకునేవాడు. అయితే ఇంత మంచి సాక్ష్యము కలిగిన తండ్రి ప్రార్థనలో పాపిని ప్రభువా, క్షమించుమని ప్రార్థించుట జాషువకు ఆశ్చర్యం కలిగేది.

ఒకరోజు జాషువ తన తండ్రితో నాన్న నువ్వు యేసయ్య బిడ్డవు కదా, ఇంకా పాపిని క్షమించమని ఎందుకు ప్రార్థిస్తు న్నావు? అని అడిగాడు. తండ్రి జాషువ ప్రశ్నకు సమాధానం చెప్పడానికి ప్రయత్నించినప్పటికి జాషువకు పూర్తిగా అర్థం కాలేదని గ్రహించాడు తండ్రి.

మరునాడు తండ్రి సాయంత్రం ఇంటికి వస్తూ ఒక దుర్భిణి తెచ్చి జాషువకు ఇచ్చాడు. 'ఏంటి నాన్న అది' అడిగాడు జాషువ. దీనిని బైనాక్యులర్స్ అంటారు. వీటిని ఉపయోగించి అస్పష్టంగా కనిపించే దూరపు వస్తువులను స్పష్టంగా చూడవచ్చు రేపు దీనిని ఉపయోగించుదాం అన్నాడు తండ్రి. జాషువ సంతోషంగా అంగీకరించాడు. మరునాడు ప్రొద్దున్నే తండ్రి జాషువను తీసుకొని మేడ మీదకు వెళ్ళి ఆకాశంలో ఎగురుతున్న పిట్టలను చూపించి వాటిని బైనాక్యులర్స్‌ను ఉపయో గించి చూడమన్నాడు. స్పష్టంగా కనబడుతున్న పిట్టలను చూసి సంతోషంగా కేరింతలు కొట్టసాగాడు. సాయంత్రం వరకు బైనాక్యులర్స్‌ని వదల్లేదు... ప్రతి వస్తువును బైనాక్యులర్స్ నుండి చూడసాగాడు.

నాలుగు రోజుల తర్వాత జాషువ తండ్రి టెలిస్కోపును తెచ్చాడు. అది చూచిన జాషువ ఎంతో ఉత్సుకతతో అదేంటి డాడీ అని అడిగాడు. దీనిని టెలిస్కోప్ అంటారు. దూరాన ఉండి మన కంటికి కనపడని వాటిని చూడడానికి దీనిని ఉపయోగిస్తారు అని చెప్పాడు. అది విన్న జాషువ ఆనందా నికి హద్దులు లేవు. వెంటనే దానిని ఉపయోగించి చూడాలని ఆశపడ్డాడు. టెలిస్కోప్ ద్వారా చంద్రుడిని చూసిన జాషువ తన కన్నులను తాను నమ్మలేకపోయాడు. చంద్రుని చుట్టు ఉన్న కాంతులను చూసి ఆశ్చర్యపోయాడు. తన అనుభవాన్ని ఎంతో సంతోషంగా తండ్రితో పంచుకున్నాడు జాషువా.

తండ్రి జాషువా కళ్ళలోని ఆశ్చర్యాన్ని ఆనందాన్ని గమనించి చిన్న చిరునవ్వు నవ్వాడు. జాషువ చెప్పవలసి నది అయిపోయిన తరువాత తండ్రి జాషువను దగ్గరకు తీసుకొని ఇలా అడిగాడు. 'చూడు జాషువా, బైనాక్యులర్స్ లేకుండా నీవు దూరంగా ఉన్న పిట్టలను చూచినప్పుడు అవి అస్పష్టంగా కనిపించాయి. అయితే బైనాక్యులర్స్ ద్వారా చూచినప్పుడు అవి చాలా స్పష్టంగా కనిపించాయి అవునా? అన్నాడు. అవునన్నాడు జాషువ. కనులు చూడలేని వాటిని టెలిస్కోప్ ద్వారా చూశావు అవునా? అడిగాడు తండ్రి అవును అన్నాడు జాషువ. అంటే మన కన్నులు చూడలేనంత మాత్రానా

నీవు టెలిస్కోపు ద్వారా చంద్రుని చుట్టు చూచిన కాంతి వలయం లేదనా? అడిగాడు తండ్రి. కాదు అన్నాడు జాషువ.

దేవుడు చేసిన ఈ సృష్టిలో మన కన్నులు అన్నింటిని చూడలేవు. వాస్తవంగా మన కనులకు కనిపించనంత మాత్రానా అవి లేవని కాదు. వాటిని చూడడానికి కొన్ని ప్రత్యేకమైన పరికరాలు ఉపయోగించాలి. అప్పుడు మాత్రమే వాటిని మనం చూడగలం. అలాగే మానవుని హృదయంలో అస్పష్టంగా కనిపించే, లేనట్టు కనిపించే పాపాలను, పాప స్వభావాన్ని చూడాలి అంటే దానికి ప్రత్యేకమైన పరికరం కావాలి. అదే అంతర్దర్శిని అన్నాడు తండ్రి.


అంతర్దర్శినినా? అదేంటి? అడిగాడు జాషువ. అంతర్దర్శిని అంటే హృదయపు లోతుల్ని చూడగలిగేది అని అర్థం. మన శరీరంలోని భాగాలను చూడడానికి మానవుడు రకరకాల పరికరాలను కనిపెట్టాడు కాని, హృదయ అంతరంగంలో ఏముందో ఎవరూ కనిపెట్టలేరు. ఎదుటివారే కాదు, మన హృదయపు లోతుల్లో ఏముందో ఒక్కోసారి మనకే తెలియదు. మనకి మనం మంచిగానే కనిపిస్తాము. అందుకే హృదయపు అంతరంగ స్వభావాన్ని తెలుకొవడానికి ఉపయోగపడే దేవుని వాక్యాన్ని అంతర్దర్శిని అంటాను నేను. దేవుని వాక్యం ఈ టెలిస్కోప్, బైనాక్యులర్స్ కంటే గొప్పది. మానవుని పాప స్వభావం పుట్టుకతో వచ్చేది అది మనుష్యులకు కనబడక పోవచ్చు కాని ప్రతి మానవుని హృదయంలో పాపం ఉంటుంది. దానిని వాక్యంతో కడగాలి. ఒకరోజు కాదు ప్రతి రోజు బ్రతికినంతకాలం మన హృదయాన్ని వాక్యంతో శుభ్రపరచుకోవాలి. బైబిల్‌ను పఠించుట ద్వారా మనలో దాగున్న, అప్పుడప్పుడు సందర్భానుసారం మనలో కనిపించే చెడును ముందుగానే చూడగలుగుతాం. దేవుని సహాయంతో దానిని తీసివేయగలుగుతాం వాక్య శక్తిని గురించి బైబిల్ ఏమని సెలవిస్తుందంటే 'దేవుని వాక్యము, సజీవమై బలము గలదై రెండంచులుగల యెటువంటి ఖడ్గముకంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను, కీళ్ళను మూలుగను విభజించునంత మట్టుకు దూరుచు హృదయము యొక్క తలంపులను ఆలోచ నలను శోధించుచున్నది" హెబ్రీ 4:12 కాబట్టి మనుష్యులకు నీతిమంతులుగా కనబడితే సరిపోదు పరిశుద్ధుడైన దేవుని ఎదుట నీతిమంతులుగా కనబడాలి అంటే అనుదినం మనలో ఉన్న పాపస్వభావాన్ని తొలగించుకోవాలి. మన జీవితాల్లో యేసయ్య లేకుంటే మనం ఎప్పటికి పాపులుగానే మిగిలిపోతాం. వాక్యాధారంగా జీవిస్తూ దేవుని సహాయం కొరకు ప్రార్థిస్తూ ఉంటే క్రమ క్రమంగా మనం యేసయ్య బిడ్డలుగా మారిపోతాం. అర్థమైందా? అడిగాడు తండ్రి. అర్థమైంది డాడీ పాపులమైన మనం యేసయ్య బిడ్డగా మారాలి అంటే వాక్యానుసారం మన ప్రవర్తన సరిచేసు కొనుటతో పాటు ఆయన మీద ఆధారపడాలి అన్నాడు జాషువ తన ప్రశ్నకు సమాధానం దొరికినందుకు సంతోషిస్తూ.

**పరిశుద్ధగ్రంథ పరిశోధనా పట్టిక - 12 జవాబు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 ఆ | 2 రు | ల | 3 క్ష | లు | ■ | 4 రూ | ■ | 5 రా |
| ■ | గు | ■ | ద్రా | ■ | 6 జా | ము | రా | త్రి |
| 7 పా | దు | దు | రు | ■ | ■ | ష | ■ | వె |
| ■ | ఏ | ■ | 8 కా | 9 లే | బు | యె | ఫు | న్నె |
| 10 లో | ■ | 11 ఆ | ■ | పి | ■ | లే | ■ | ల |
| 12 ము | న | ది | రి | ల్ల | 13 అ | ■ | 14 డి | ■ |
| య | ■ | వా | ■ | ■ | 15 హ | బ | కు | క్కూ |
| 16 ల | సా | ర | చె | ■ | రో | ■ | ద | ■ |
| ఆ | ■ | ము | ■ | 17 లు | ను | ప | వె | ట్టి |

**పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక - 12**
**సరైన జవాబులు పంపించిన వారు**

1. డి. మెర్సీ ఇశ్రాయేల్, నెల్లూరు
2. కె. రూత్ ఇవాంజిలిన్, హైదరాబాద్
3. వి. ఎస్తేరు, అనంతపురం
4. జె. సునీల, శ్రీకాకుళం
5. శ్రీమతి బి. ఆనీమేరి, హైదరాబాద్
6. యం. సామ్యేల్‌రాజ్, నంద్యాల
7. పి. శాంతాగ్రేస్, మచిలీపట్నం
8. జి. సుశీల, విజయవాడ



# పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పత్రిక - 13

**అడ్డం:**

6. యెహోవా అగ్ని ఇశ్రాయేలీయులలో రగులు కొని నందున ఆ చోటుకి 'మంట' అని అర్థమిచ్చు పేరు పెట్టబడెను (3) (సం.కా)
8. ఎ.బి మాసిలామణిగారి పాట 'నడిపించు.... (3) (తిరగబడింది)
10. గెర్షోనీయుల ప్రధానుడైన ఎలీయాసాపు తండ్రి (3) (సం.కా)
11. ఏ నరుడును సాధుచేయనేరనిది (3) (యాకోబు)
13. యెహోవా మోషేతో నీ చెయ్యి ---(3) (నిర్గ)
15. తారుమారైన నాబాలు భార్య (5) ( 1 సమూ.)
16. సముద్రం మీద--- లేచినందున యేసు ఎక్కిన దోనె అలలచేత కప్పబడెను (3)(మత్తయి)
18. పాపము పరిపక్వమై మరణమును ---(3) (యాకోబు) (తిరగబడింది)
20. మహాసమాజములో నీతి --- ను నేను ప్రకటించి యున్నానని నేనంటిని (3) (కీర్త)
21. వివాహము అన్ని విషయములలో ఘనమైనదిగాను, --- నిష్కల్మషమైనదిగాను ఉండవలెను (3) (హెబ్రీ)
23. యూదారాజైన అహజ్యా చనిపోయిన స్థలం తిరగ బడింది (3) (2 రాజులు)

**నిలువు:**

1. ఏలీములో 70 -- చెట్లు గలవు (2)(నిర్గ)
2. తలక్రిందులైన బెన్యామీను 5వ కుమారుడు(2) (1దిన)
3. ఎవరు ఎవరితో వాదించుచు మోషే శరీరమును గూర్చి తర్కించిరి (9) (యూదా)
4. తలక్రిందులైన అహష్వేరోషు భార్య (2) (ఎస్తేరు)
5. ఇంచుమించు 50రూపాయిలకు సమానమైన ఆనాటి నాణెం (2) (లూకా)
7. లూజు అనే ఊరికి యాకోబు పెట్టిన పేరు (3)(ఆది)
9. పరిసయ్యులు పదియవంతు చెల్లించు పదార్థాలలో ఒకటి తిరగబడింది (3) (మత్తయి)
11. అహాబు ఆశించిన ద్రాక్షతోట యజమాని (3) (1రాజులు)
12. మొట్టమొదటి నరహంతకుడు (3) (ఆది.)
13. ఏనాటి కీడు ఆనాటికి ---(3) (మత్తయి)
14. తిరగబడిన విశ్వాసఘాతకుల మార్గము (3) (సామె.)
17. సమూయేలు చనిపోయిన తరువాత దావీదు ఏ అరణ్యమునకు వెళ్ళెను? (3)(1సమూ)
19. తలక్రిందులైన అబీమెలెకు తండ్రి (3)(న్యాయా)
21. పౌలు బర్‌యేసును చూచిన ఊరు (2) (అపొ.కా)
22. -- చచ్చిపోదుము గనుక తిందుము త్రాగుదము... (2) (యెషయా) (తలక్రిందులైంది)
23. తలక్రిందులైన కాసిప్యా అను స్థలమందుండు అధికారి (2) (ఎజ్రా)
24. దేవుని హస్తము గోడమీద వ్రాసిన మాటలో మొదటి సగము (2) (దాని)